ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
బుధవారం సెప్టెంబరు 25, 2024 5

భవదీప్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వరదనీటి బ్యాక్టీరియాతో కాలు కోల్పోయిన బాలుడు భవదీప్ వైద్య ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరైంది. మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మంజూరైన రూ. 10 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాలుడి తండ్రి నాగరాజుకు అందజేశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేయగా రెండో కాలుకు సోకిన బ్యాక్టీరియా నెమ్మదించి స్వల్పంగా ఆరోగ్యం మెరుగు పడుతుందని వైద్యులు తెలిపారు. బ్యాక్టీరియా కారణంగా కొంత భాగం వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించినట్లు తెలిపారు. 'ఈనాడు' కథనంతో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అప్రమత్తం కావడంతో జగ్గయ్యపేటలోని భవదీప్ నివాస పరిసరాల్లో, మురుగునీటి ప్రభావిత ప్రాంతాల్లో వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక పరిశీలన చేశారు. ఎమ్మెల్యే తాతయ్య చొరవతో ప్రభుత్వం సత్వరం స్పందించి తమకు అండగా నిలవడంతో నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ అంకుర్ ఆసుపత్రిలో జరుగుతున్న వైద్యంపై కలెక్టర్, జిల్లా వైద్యాధికారి క్రమం తప్పకుండా దృష్టి సారించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరో వారం రోజుల్లో భవదీప్ పూర్తిగా కోలుకొని తిరిగి రావచ్చని ఎమ్మెల్యే తాతయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.



బాలుడి తండ్రి నాగరాజుకు రూ.10 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య


సనాతన ధర్మం.. సదా ఆదర్శనీయం అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం ఇంద్రకీలాద్రి.. దుర్గగుడి ఆలయ మెట్లను ఆయన శుభ్రం చేశారు. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు.

పుట్టి.. ముంచుతున్నారు!

- పరిహారానికి కొందరి పాకులాట
- అధికార యంత్రాంగానికి సవాలు
- అర్హులుగా 68 వేల కుటుంబాలు
- పరిశీలనలో మరో 18 వేల అర్జీలు

ఈనాడు, అమరావతి

"లక్ష్మీ... పాత రాజరాజేశ్వరిపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. భర్త లేరు. కూతురుతో కలిసి ఉంటోంది. కూతురు బిడ్డకు జ్వరం వస్తే.. చికిత్స నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లారు. వరదలు తగ్గాక తాను నివాసం ఉండే ప్రాంతానికి వచ్చింది. కానీ అప్పటికే ముంపు నష్టం గణన బృందం వచ్చి ఇంటి యజమాని పేరు రాసుకుని వెళ్లింది. ఆమె ఇంట్లో ఉంటున్న విషయం యజమాని చెప్పలేదు. దీనిపై సచివాలయ ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు."

"కుమ్మరిపాలెం వద్ద కొన్ని డివిజన్లను కృష్ణా వరద ముంచెత్తింది. ఒక పూట.. అదీ 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు ఆవాసాల్లోకి నీరు చేరి అదే రోజు తగ్గింది. కానీ తమకు పరిహారం ఇవ్వాలని వారు ఆందోళన చేశారు. దీనికి వైకాపా వత్తాసు పలుకుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కనీసం రెండు రోజులు.. ఆపై వరద ఉంటేనే.. పరిహారం ఇవ్వాలి. ఈ పరిస్థితి 38, 39, 40 డివిజన్లలో ఉంది. దీనికి పరిహారం ఇవ్వడం లేదనే కారణం చూపిస్తున్నారు."



..ఇలాంటి ఫిర్యాదులు ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 18 వేల మంది అందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వరద ముంపు ప్రాంతాల బాధిత కుటుంబాలకు భారీగా పరిహారం ప్రకటించింది. గతంలో ఇల్లు పూర్తిగా మునిగినా.. ధ్వంసమైనా.. రూ.5 వేలే ఇచ్చేవారు. ప్రస్తుతం విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.25 వేలకు పెంచారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇల్లు మునిగితే రూ.25 వేలు, మొదటి అంతస్తులో వారికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇతర ప్రాంతాల వారికి రూ.10 వేలు చొప్పున, దుకాణాలు మునిగి సరుకు పాడైతే రూ.25 వేలు ప్రకటించారు. దీంతో భారీగా నకిలీలు పుట్టుకొస్తున్నారు. బుడమేరు పొంగి సింగ్‌నగర్.. దాని చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తింది. దాదాపు 10 రోజులు నీరు నిలిచే ఉంది. కృష్ణా నది కొన్ని ప్రాంతాలను ముంచినా.. ఒక్క రోజులోనే వరద తగ్గింది. దీంతో అక్కడా సమానంగా పరిహారం ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది.




జాబితా చూసుకుంటున్న నివాసితులు

నకిలీలతో అసలుకు ఎసరు...

ఎలాంటి ఆధారం లేకుండా నకిలీ వ్యక్తులు తాము నివాసం ఉంటున్న ప్రాంతం మునిగిందని అర్జీలు ఇస్తున్నారు. తమ పేరు నమోదు చేయలేదని కలెక్టరేట్ గ్రీవెన్సులో ఫిర్యాదులు చేశారు. అయితే నివాసం ఉంటున్నట్లు ఒక్క రుజువు చూపడం లేదు. నకిలీల వ్యవహారంతో అసలు లబ్ధిదారులకు అన్యాయం జరిగే వీలుందని వాపోతున్నారు. మొదట సచివాలయాల సిబ్బంది ఇంటింటికి తిరిగి వీఎంసీ ఆధ్వర్యంలో ఎన్యుమరేషన్ చేశారు. వరద పూర్తిగా తగ్గకుండానే ఈ లెక్కలు తీసుకున్నారు. ఆ సమయంలో నివాసం ఉండేవారు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఇళ్లకి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో రేషన్ కార్డు మ్యాపింగ్ ద్వారా గణాంకాలు వేశారు. దీనిపై కలెక్టర్ సృజన మరోసారి పరిశీలన చేయించారు. 68 వేల కుటుంబాలను గుర్తించి.. సీఎంవోకు నివేదించారు. ఈమేరకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో బుధవారం పరిహారం జమ చేయనున్నారు.

అన్నింటిలోనూ కన్నే శారు...

అయితే దీనికి అదనంగా మరో 18 వేల దరఖాస్తులు అందాయి. వీటికి వారు నివాసం ఉండే ఇంటి విద్యుత్తు బిల్లు కానీ, ఇతర నివాసం ఉంటున్న ఆధారం కానీ చూపడం లేదు. అన్నీ కింది పోర్షన్‌లో ఉంటున్నట్లు దరఖాస్తులు అందించడం విశేషం. ఒక పోర్షన్‌లో మూడు గదులు ఉంటే.. ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. అందిన దరఖాస్తులపై ఇంటి చుట్టుపక్కల వారితో విచారణ చేయించి పరిశీలించే అవకాశం ఉందని తేలింది. కేవలం ఇళ్ల విషయంలోనే కాదు.. ఇతర అంశాలు వాహనాలు, గృహోపకరణాల్లోనూ బోగస్ పుట్టుకొస్తున్నాయి.

మరింతగా పరిశీలిస్తేనే..

18 వేల దరఖాస్తుల్లో వాస్తవంగా నివాసం ఉన్న వారు ఎందరనేది విచారణ చేయాల్సి ఉందని కలెక్టర్ సృజన చెప్పారు. పరిశీలించాకే.. వారికి పరిహారం ఇవ్వనున్నారు. సింగ్‌నగర్, పాయకాపురం, జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ, వాంబేకాలనీ, న్యూ, పాత రాజరాజేశ్వరిపేట, మిల్క్‌ప్రాజెక్టు.. చిట్టినగర్, మధురానగర్‌ల్లో కొన్ని కాలనీలు, గ్రామీణంలో కొన్ని గ్రామాలు ముంపులో ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణలంక, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, రామలింగేశ్వర్‌నగర్‌ల్లో వరద ఒక్క రోజే ఉంది. వారికి పరిహారం ఇచ్చే అంశం పరిశీలనలో ఉంది.

అవినీతికి అవకాశం లేకుండా పరిశీలన

ముఖాముఖి

\- ఈనాడు, అమరావతి



అర్హులందరికీ వరద ముంపు పరిహారం
అభ్యంతరాలపై పునఃపరిశీలన: కలెక్టర్

"వరద ముంపునకు గురై నష్టపోయిన అర్హులైన ప్రతి కుటుంబానికి పరిహారం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అదేసమయంలో కేవలం పరిహారం కోసం దరఖాస్తు చేసిన బోగస్ పేర్లను ఏరేస్తామని" కలెక్టర్ సృజన స్పష్టం చేశారు. వరద బాధితుల గుర్తింపు ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఇప్పటికే రెండుసార్లు అధికారుల బృందాలు పరిశీలించి జాబితా తయారు చేశాయి. అయినా నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మరి కొందరు అర్హుల జాబితాలో తమ పేర్లు లేవని ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ జి.సృజనతో 'ఈనాడు' ముఖాముఖి.

ఈనాడు: నగరంలో కొన్ని డివిజన్లకు ఎన్యుమరేషన్ బృందాలు వెళ్లలేదని ఫిర్యాదు చేస్తున్నారు?

కలెక్టర్: మీరనేది కుమ్మరిపాలెం ప్రాంతంలోనే కదా? 38, 39, 40 డివిజన్లను కృష్ణా వరద ముంచెత్తింది. ప్రభుత్వ జీవో ప్రకారం కనీసం 2 రోజులు వరద నిలకడగా ముంచెత్తిన ఇళ్లకే పరిహారం అందుతుంది. అది కూడా 15 నుంచి 30, 50 శాతం నష్టం జరిగినట్లు తేలాలి. ఆయా డివిజన్లు కేవలం ఒక రోజే ముంపులో ఉన్నాయి. దీనిపై ప్రత్యేక అధికారులను పంపి విచారణ చేయించా. ఒక్క రోజే వరద ఉందని నివేదిక ఇచ్చారు. తర్వాత దీనిపై ఆర్డీవోను క్షేత్రానికి పంపి పరిశీలన చేయించాను. ఆయనా అదే నివేదించారు. ప్రస్తుతం పరిహారం కావాలని డిమాండ్ చేస్తున్న వారు.. సిఫార్సు చేస్తున్న వారు కూడా అంగీకరిస్తున్నారు. కానీ నిబంధనల ప్రకారం పరిహారం ఇవ్వడం సాధ్యం కాదు కదా? అందుకే ఎన్యుమరేషన్ బృందాలు రాలేదని చెబుతున్నారు. కృష్ణలంక పరిధిలోనూ కొన్ని ప్రాంతాలు ఒక్క రోజులోనే ముంపులో ఉన్నాయి. అలాంటి వాటిని పరిహరించాం.

ఈనాడు: బోగస్ పేర్లు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి..?

కలెక్టర్: పరిహారం కోసం భారీగా బోగస్ పేర్లు వస్తున్నాయి. ఎలాంటి ఆధారం చూపకుండా నాపేరు రాలేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఎక్కడో శ్రీకాకుళం నుంచి వచ్చి పరిహారం కావాలంటే ఎలా ఇస్తాం. కనీసం చిరునామా రుజువు ఉండాలి కదా..? కరెంటు బిల్లు, రెంటల్ అగ్రిమెంటు, రేషన్‌కార్డు మ్యాపింగ్ ఇతర ఆధారాలు చూపించాలి. ఇప్పటికి రెండుసార్లు పరిశీలన చేయించాను. సచివాలయ ఉద్యోగులు నమోదు చేయించిన దానిపై ఒకసారి, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు పరిశీలన చేశారు. ఈ రెండింటిపై తిరిగి మన జిల్లా అధికారులతోనూ పునః పరిశీలన చేశాం. ఇంత చేసినా వాస్తవాలు వెలుగు చూడాలి కదా? అవినీతి చేసేందుకు తప్పుడు పేర్లు నమోదు చేసే అవకాశం ఉంది కదా? నాలుగు పేర్లు నమోదు చేస్తే.. రూ.లక్ష ఖాతాలో జమ అవుతాయి. ఈ అవినీతిని అరికట్టేందుకు కఠినంగానే వ్యవహరించాల్సి వస్తోంది. అందుకే తప్పనిసరిగా రుజువు ఉండాలి.

ఈనాడు: చాలా మంది తమ పేర్లు జాబితాలో లేవని ఫిర్యాదు చేస్తున్నారు.?

కలెక్టర్: ఇప్పటికి 18 వేల అర్జీలు అందాయి. వాటిని పరిశీలించాలి. మ్యాపింగ్‌ను బట్టి అర్హులను గుర్తించాం. ఎవరైనా ఇంట్లో లేకపోతే తప్పిపోయి ఉండవచ్చు. యాప్‌లోనూ ఒక రోజు సాంకేతిక సమస్యతో కొన్ని పేర్లు కనిపించలేదని తెలిసింది. వాటిని సరిదిద్దాం. మిగిలిన వాటిని పరిశీలిస్తాం.

ఈనాడు: అద్దెకు ఉండే వారి పేర్ల స్థానంలో యజమాని తనే ఉంటున్నట్లు నమోదు చేస్తున్నారు?

కలెక్టర్: అద్దెకు ఉండే వారికి అన్యాయం జరగదు. అధికారుల బృందాలు వెళ్లి విచారణ చేసి అద్దెకు ఉంటున్నట్లు రుజువైతే. . రాస్తున్నారు. అలాంటి యజమానులపై చర్యలు ఉంటాయి. అక్కడ యజమాని నివాసం ఉంటున్నారో లేదో విచారణలో తేలుతుంది. అలాగే స్థానికులతోనూ పంచనామా చేయిస్తున్నాం.

ఈనాడు: పంట నష్టపరిహారం విషయంలోనూ రైతులు అసంతృప్తితో ఉన్నారు కదా..?

కలెక్టర్: ఈ-క్రాప్ చేయించి ఈ-కేవైసీ పూర్తి చేసిన రైతుల పేర్లు నమోదు చేశాం. నిబంధనల మేరకు 5 ఎకరాల వరకు పరిహారం అందిస్తాం. నివేదిక ప్రభుత్వానికి పంపాం.

ఉప్పొంగిన పెద్దవాగు

వాగు అవతల వైపు చిక్కుకుపోయిన విద్యార్థులు, రైతులు


పొంగిపొర్లుతున్న వాగు

విజయవాడ రూరల్ (నున్న), న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వికాస్ కళాశాల రోడ్డులోని పెద్ద వాగు పొంగింది. కొండ ప్రాంతాల నుంచి వచ్చిన వరద రహదారి మీద నాలుగు అడుగుల మేర ప్రవహించింది. దీంతో పొలాలకు వెళ్లిన రైతులతో పాటు, వికాస్ కళాశాల విద్యార్థులు వాగు అవతల వైపున చిక్కుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి వాగు ఉద్ధృతి తగ్గకపోవడంతో అన్నదాతలు, విద్యార్థులు పోలీసులు, గ్రామస్థులకు సమాచారం అందించారు. ట్రాక్టర్లు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. దీంతో వికాస్ కళాశాల కరస్పాండెంట్ విద్యార్థులకు కళాశాల వసతి గృహంలో బస ఏర్పాటు చేసి వారిని వెనక్కి తీసుకెళ్లారు. రైతులకు కళాశాలలో ఆహారం ఏర్పాటు చేయగా కొంతమంది అక్కడకు వెళ్లారు. రాత్రి 10 గంటల సమయానికి వరద తగ్గే అవకాశం ఉండటంతో వారిని వాగు దాటేంచేందుకు అధికారులు, పోలీసులు ట్రాక్టర్లు ఏర్పాట్లు చేశారు.



పోలీసుల బందోబస్తు



వరద తగ్గాక నెమ్మదిగా సాగుతూ..

వరద బాధితులకు పరిహారం అందజేత నేడు

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఖాతాలకు జమ



ఈనాడు డిజిటల్, అమరావతి: వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి నేరుగా డీబీటీ కింద బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారని కలెక్టర్ జి.సృజన మంగళవారం తెలిపారు. నగర పరిధిలోని ముంపు ప్రాంతాల్లోని బాధితులకు అందించే సాయంపై ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. బుడమేరు ఉద్ధృతికి వేల ఇళ్లు, దుకాణాలు, తోపుడు బళ్లు, చిన్నతరహా పరిశ్రమలు, వాహనాలు, పంటలు రోజుల తరబడి నీటిలో ఉండి పాడైన బాధితులకు పరిహారం అందనుందన్నారు.

దసరా ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి: ఎంపీ శివనాథ్


కరదీపికను విడుదల చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాదశర్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా భావించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దుర్గ గుడి అధికారులు రూపొందించిన దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక, కరదీపికలను ఈవో రామారావు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఉత్సవాలు ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే విధంగా దేవాదాయ శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈవో రామారావు మాట్లాడుతూ.. ఘాట్ రోడ్డులో రిటైనింగ్ గోడ, శివాలయం మెట్ల మార్గం వద్ద ఫుట్ బ్రిడ్జి ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కమిషనర్ సహకారంతో ఒక వైపు అభివృద్ధి పనులు, మరొక వైపు దసరా ఏర్పాట్లు నిర్విఘ్నంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్య శివప్రసాదశర్మ పాల్గొన్నారు.

కొనకళ్ల చేతికి.. ఆర్టీసీ స్టీరింగ్!

- విధేయత, అంకితభావానికి గౌరవం
- వరించిన ఆర్టీసీ ఛైర్మన్ పదవి
- ఎంపీ సీటు త్యాగానికి ఫలితం

ఈనాడు, అమరావతి

"మిత్రధర్మంలో భాగంగా.. సార్వత్రిక ఎన్నికల పోటీ నుంచి తప్పుకొన్న తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు ఉమ్మడి జిల్లాలో తొలి నామినేటెడ్ పదవి దక్కింది. రాష్ట్ర రవాణా సంస్థ ఛైర్మన్‌గా కొనకొళ్ల నారాయణరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తెదేపా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయనతోపాటు పలు కార్పొరేషన్ సభ్యులుగా ముగ్గురు నేతలను పదవులు వరించాయి. విధేయత, అంకితభావం, పార్టీ పట్ల నిబద్ధతతోనే.. కొనకొళ్లకు నామినేటెడ్ పదవి లభించినట్లు పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి."


కొనకళ్లను అభినందిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, తదితరులు

తెదేపాలో ఇంతింతై ఎదిగి...

ఆది నుంచి తెదేపాలో కొనసాగుతున్న కొనకొళ్ల... మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహించారు. వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన ఆయనకు పార్టీలో గుర్తింపు లభించింది. ఆయన తొలిసారి 2009లో బందరు నుంచి పార్లమెంటుకు పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి రామకృష్ణపై విజయం సాధించారు. అనంతరం 2014లోనూ వైకాపా అభ్యర్థి కొలుసు పార్థసారథిపై ఘనవిజయం సాధించారు. 2019లో పోటీ చేసి వైకాపా అభ్యర్థి వల్లభనేని బాలశౌరిపై ఓటమి చెందారు. అనంతరం పార్టీ కోసం పని చేశారు. అప్పట్లో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పార్టీ సారథ్యం నిర్వహించేవారు. ఆయన అకాల మరణంతో పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కొనకళ్ల సేవలందించారు. గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు సైతం నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

రాజకీయంగా ప్రాధాన్యం!

\- కొనకొళ్ల నారాయణరావు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా నాకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో పోటీకి వీలులేకపోవడంతో నామినేటెడ్ పదవి ఇచ్చారు. గతంలోనూ 2014లో నేను గెలిచిన తర్వాత లోక్‌సభలో ప్యానల్ స్పీకర్‌గా నా పేరు సూచించారు. పార్టీ నుంచి లోక్‌సభకు మూడు సార్లు పోటీ చేసే వీలు కల్పించారు. ఆర్టీసి ఛైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉంది. ఆర్టీసీ అభివృద్ధికి తగినవిధంగా కృషి చేస్తా. అధినేత నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. 2024లో నాకు సీటు ప్రకటించిన తర్వాత పొత్తులో భాగంగానే జనసేనకు ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయాన్ని బహిరంగ సభల్లోనూ చంద్రబాబు ప్రకటించడం ఆయన సంస్కారానికి నిదర్శనం.

మాట నిలుపుకొన్న చంద్రబాబు...

బందరు నుంచి మూడుసార్లు పార్లమెంటుకు పోటీ చేసిన కొనకళ్ల... నాలుగోసారి కూడా టికెట్ తనకే వస్తుందని గత ఎన్నికల్లో ఆశించారు. అధిష్ఠానం కూడా ఆయన పేరే ప్రకటించింది. కానీ జనసేనతో పొత్తులో భాగంగా బందరు స్థానాన్ని ఆ పార్టీ కోరింది. అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్న బాలశౌరి పార్టీ మారి జనసేనలో చేరారు. 2024లో ఆయన పోటీ చేసి మిత్రపక్షాల అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. ఎన్నికల ప్రచారంలో బాలశౌరి తరపున కొనకళ్ల విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. నాడు బహిరంగ సభలో తెదేపా అధినేత చంద్రబాబు.. పార్టీ కోసం తన సీటును త్యాగం చేశారని కొనకొళ్లను పలుమార్లు అభినందించారు. అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామనీ.. సేవలు వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం.. ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా పలు పదవులను కొనకళ్ల నిర్వహించారు. 2009లో నేరుగా పార్లమెంటు ఎన్నికల్లో రంగంలోకి దూకి విజయం సాధించారు.

మరో ముగ్గురు సభ్యులుగా...

తొలిజాబితాలో మరో ముగ్గురు నేతలకు సభ్యులుగా నామినేటెడ్ పదవులు లభించాయి. విజయవాడ సెంట్రల్ నుంచి సింగం వెంకటేశ్వరరావుకు ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి సంస్థ సభ్యుడిగా పదవి లభించింది. గుడివాడకు చెందిన లోహిత్ సిస్లాకు ఏపీ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పదవి లభించింది. పెడన నుంచి ఏపీట్రైకార్‌లో డైరెక్టర్‌గా సలపాటి వీరప్రసాద్‌కు పదవి లభించింది.

పలువురు నిరీక్షణ...

మరోవైపు పలువురు తెదేపా నేతలు ఇంకా నిరీక్షణలో ఉన్నారు. ప్రధానంగా మైలవరం సీటు త్యాగం చేసిన దేవినేని ఉమాకు ఏ పదవి ఇస్తారనేది ఉత్కంఠ నెలకొంది. విజయవాడ పశ్చిమ నుంచి తెదేపా ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా (గతంలో పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్), తిరువూరు నుంచి సీటు ఆశించిన శ్యావల దేవదత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తదితరులు ఉన్నారు.

భవానీ ద్వీపం.. వరద గాయం..



కూలిన చెట్టు


కోతకు గురైన రహదారి అంచులు


రూపు చెదిరిన ఆకృతి

ఏకార్లు స్థాయిలో సుమారు 11లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు పైనుంచి రావడంతో విజయవాడ కృష్ణా నదిలోని భవానీ ఐల్యాండ్ నీటిలో మునిగిపోయింది. బోట్లు, కాటేజీలు, ఆట వస్తువులు అన్నీ దెబ్బతిన్నాయి. నది అంచుల్లో వేసిన రోప్లన్నీ నీటి ఒరవడికి కొట్టుకుపోయాయి. ఫైబర్ బోట్లు, వృక్షాల కేంద్రం, పిల్లలు ఆడుకునే వస్తువులన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. భవానీ ఐల్యాండ్‌కు రూ. కోట్లలో నష్టం వాటిల్లింది. ఐల్యాండ్‌ను శుభ్రం చేసి మళ్లీ పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. - ఈనాడు, అమరావతి


మునిగిపోయిన బోటు




పేరుకుపోయిన ఇసుకమేటలు


పరిసరాలు ఇలా...

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. 55వ డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజాదరణతో 100 రోజులు పూర్తి చేసుకుందన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ఇమామ్‌లకు, మౌజాన్లకు గౌరవ వేతనాలు వచ్చే నెల నుంచి ఇవ్వబోతున్నట్లు వివరించారు. హజ్ యాత్రికులకు రూ.లక్ష ప్రభుత్వం అందిస్తుందన్నారు. పశ్చిమలో డ్రెయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. నైజాంగేటు ప్రాంతంలో రైల్వే లైను కింద ఉన్న డ్రెయినేజీ మెరుగు పరిచే విషయమై రైల్వే అధికారులతో మాట్లాడనున్నట్లు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ఫతావుల్లా కార్పొరేటర్ అర్షద్, జాహిద్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందిస్తున్న ఎంపీ చిన్ని తదితరులు

పొన్నవోలుపై కేసు నమోదు చేయాలి : మాజీ ఎమ్మెల్సీ



విద్యాధరపురం: తిరుపతి లడ్డూ అపవిత్రంపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యలను హైకోర్టు సుమోటోగా తీసుకొని ఆయనపై కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. మల్లికార్జునపేటలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వ్యతిరేకంగా ఊరూరా తిరిగి ప్రచారం చేసిన విషయం ప్రజలు గమనించారన్నారు. తిరుపతి లడ్డూను అపవిత్రం చేయడమే కాకుండా పంది కొవ్వుతో ఆవు నెయ్యిని పోల్చి మాట్లాడడం పొన్నవోలు అహంకారానికి పరాకాష్ఠ అన్నారు. నిబంధనలు పాటించని ఆయనకు న్యాయవాదిగా ఉండే అర్హత లేదన్నారు. భూమన కరుణాకరరెడ్డి తిరుమలపై సృష్టించిన డ్రామాను భక్తులు గమనించారన్నారు. వేంకటేశ్వర స్వామి ఆస్తులను కొల్లగొట్టిన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి, వై.వి. సుబ్బారెడ్డి మోకాళ్లపై వేంకటేశ్వర స్వామి వద్ద నిలుచుని క్షమాపణ కోరుకుంటే చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం లభిస్తుందన్నారు. టీటీడీ ఈవోగా వ్యవహరించిన ధర్మారెడ్డి గడచిన ఐదేళ్లలో చేసిన పాపాలను ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

వరదల్లో ఇళ్లు మునిగిన వారికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు

ఈనాడు, అమరావతి: ఇటీవలి వరదల్లో ఇళ్లు మునిగి వివిధ రకాల ధ్రువపత్రాలను కోల్పోయిన వారికి... ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి వాటిని ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడలో వరద ముంపు కారణంగా.. ఇళ్లలోకి నీరు చేరడంతో పలువురి విద్యార్హత సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, దస్తావేజులు, ఆధార్, జనన, మరణ, వివాహ పత్రాలు పూర్తిగా తడిచి పోయాయి. కొన్నిచోట్ల సామాన్లతోపాటు కొట్టుకుపోయాయి. తమకు నకలు ధ్రువపత్రాలను ఉచితంగా ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకుని అధీకృత కాపీలు, డూప్లికేట్ సర్టిఫికెట్లు, పత్రాలను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం సంబంధిత శాఖలను ఆదేశించింది. ప్రభావిత ప్రాంతాల వారీగా క్యాంపులు నిర్వహించాలంటూ రెవెన్యూ(విపత్తుల నిర్వహణ శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

తెల్లబంగారం.. పైర్లు కళావిహీనం

రైతులకు కోలుకోలేని దెబ్బ
ఎకరానికి రూ.50 వేలు నష్టం


అనాసాగరం వద్ద దెబ్బతిన్న పత్తి పైరు

నందిగామ, న్యూస్‌టుడే

తెల్లబంగారంగా పిలుచుకునే పత్తి పంట ఈసారి అన్నదాతలకు చేతికందని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పైర్లకు కోలుకోలేని విధంగా నష్టం వాటిల్లింది. పూత, పిందె, కాయలు రాలిపోయి కేవలం మొక్కలు మాత్రం కళావిహీనంగా కనిపిస్తున్నాయి. పైర్లు తిరిగి కోలుకుంటాయని నమ్మకం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

☛ ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది 90 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. నందిగామ నియోజకవర్గంలో 45 వేల ఎకరాల్లో, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 20 వేల ఎకరాలు సాగు చేశారు. మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోను సాగు చేశారు. సుబాబుల్‌లో అంతర్ పంటగాను సాగు చేశారు. గత జులైలో వర్షాలు అనంతరం పత్తి విత్తనాలు వేశారు. పూత, పిందె, కాయ దశలో ఆశాజనకంగా ఉన్న సమయంలో భారీవర్షాలు పడ్డాయి. అతిభారీవర్షాలు వల్ల పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాగులు, ఏర్లు, ముంపు ప్రాంతాల్లో ఉన్న పత్తి పైర్లు నాలుగైదు రోజులు వరదలోనే ఉన్నాయి. దీంతో పూర్తిగా ఎండిపోయాయి. వర్షాలు తగ్గిపోవడంతో పైర్లకు జరిగిన నష్టం తెలుస్తోంది. అధిక తేమ శాతం వల్ల ఎక్కువగా పత్తి మొక్కలకు నష్టం వాటిల్లింది. దీనికితోడు తెగుళ్లు ఆశించడంతో ఆకులు ముడుచుకుని ఉన్నాయి. కొందరు ఇప్పటికి పైర్లపై ఆశలు వదులుకున్నారు. కొంత మంది రైతులు మాత్రం తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ. 50 వేలు పెట్టుబడి పెట్టగా తిరిగి వచ్చే పరిస్థితి లేదు. దీంతోపాటు ఎకరానికి రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు వరకు కౌలు నష్టపోవల్సి వస్తోంది. కొందరు రైతులు పత్తి మొక్కలు తొలగించి ప్రత్యామ్నాయ పైర్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పూర్తిగా ధ్వంసం

అధిక వర్షాలకు పత్తి పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎకరానికి రూ. 40 వేలు నుంచి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టాం. మొక్కలు ఎండిపోతున్నాయి. పూత, పిందెల రాలిపోయ్యాయి. తిరిగి కోలుకునే పరిస్థితి లేదు. - గాడిపర్తి వెంకటేశ్వరరావు, అడవిరావులపాడు

విద్యార్థిని అపర్ణ మృతిపై విచారణ కమిటీ

ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: ముప్పాళ్లలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని కస్తాల అపర్ణ మృతికి బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రత్యేకంగా కమిటీ వేసి నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు. నందిగామలోని శవాగారంలో అపర్ణ మృతదేహాన్ని మంగళవారం ఆర్డీవో రవీంద్రరావు, ఏసీపీ రవికిరణ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. బాలిక మృతి చెందిన విషయాన్ని విద్యా శాఖ మంత్రి లోకేశ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. తెదేపా తరపున బాధిత కుటుంబానికి రూ. ఐదు లక్షలు అందజేశారు. ప్రభుత్వం నుంచి మరో రూ. ఐదు లక్షలు నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు. బాలిక తల్లిదండ్రుల్లో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామన్నారు. ఇద్దరు కుమారులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పించి చదివిస్తామని తెలిపారు.


అపర్ణ తండ్రి, సోదరులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, పక్కన ఆర్డీవో రవీంద్రరావు

ప్రిన్సిపల్ సస్పెన్షన్

బాలిక మృతి ఘటనలో పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్, జీఎన్ఎంలను కలెక్టర్ సృజన సస్పెండ్ చేశారని ఎమ్మెల్యే సౌమ్య వెల్లడించారు. కమిటీ నివేదిక రాగానే ఇంకా బాధ్యులైన పాఠశాల సిబ్బంది, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తెదేపా నాయకులు కోట వీరబాబు, వాసిరెడ్డి ప్రసాదు, కోట వీరబాబు, ఉన్నం నరసింహారావు, కోట రాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దొండపాటి సుధాకర్, న్యాయవాదులు బొందలపాటి రామకృష్ణ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణంతోనే రాష్ట్ర భవిష్యత్తు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణానికి నిధులు ఇచ్చి ఆదుకోవాలని రాజధాని రైతులు, అమరావతి ఐకాస నాయకులు ప్రపంచ బ్యాంకు, ఏషియన్ అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులను కోరారు. మంగళవారం గుంటూరు జిల్లా తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో ఆయా బ్యాంకుల ప్రతినిధులు రాజధాని రైతులు, రైతు కూలీలు, ఐకాస నాయకులు, డ్వాక్రా మహిళలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు, రాజధాని రైతులు మాట్లాడుతూ ఏ రాష్ట్రమైన అభివృద్ధి చెందాలంటే ఒక సుస్థిరమైన రాజధాని కావాలని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల నుంచి 34 వేల ఎకరాలు సమీకరించి అధునాతన ఆలోచనలతో అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వివరించారు. దీని వల్ల ఇక్కడి భూముల ధరలు పెరగడంతోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాజీ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అప్పటి పరిస్థితిని వీడియోల రూపంలో బ్యాంకుల ప్రతినిధులకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో నిలవడం ఖాయమని, అమరావతి నిర్మాణానికి రుణాలు ఇవ్వాలని చేతులు జోడించి అభ్యర్థించారు. అనంతరం తుళ్లూరు మండలంలోని డ్వాక్రా మహిళలతో బ్యాంకుల ప్రతినిధులు చర్చించారు. అమరావతి నిర్మాణం జరిగితే తమ జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, రాజధాని నిర్మాణాన్ని తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని మహిళలు వివరించారు. అమరావతి ఐకాస నాయకులు ధనేకుల రామారావు, మాదల శ్రీనివాస్, అనుమోలు గణేష్, జూజాల చలపతిరావు, బెల్లంకొండ నరసింహారావు, కాటా అప్పారావు, చిలకా బసవయ్య, వరలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


రాజధాని రైతులు, ఐకాస నాయకులతో చర్చిస్తున్న ప్రపంచ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..

రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించటానికి ప్రత్యేక కాంపిటెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తున్నామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడించారు. త్వరలోనే అసైన్డ్ రైతులకు కౌలు చెల్లిస్తామని, రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు (పర్యావరణ, సామాజిక నిపుణులు) బి. వెంకటరావు, ఎన్. వెంకటసుబ్బారావు, రంజన్ వర్మ, ఈన్‌పే సోబ్క్ జెనెస్కా, ఏసియన్ అభివృద్ధి బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : గిరిజనుల అభ్యున్నతికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) నాయకులు, విద్యార్థులు విజయవాడ మొగల్రాజపురంలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన నిర్వహించారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాయక్ మాట్లాడుతూ... వైకాపా పాలనలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి జరగలేదని, కొత్త పథకాలు పెట్టకపోగా.. ఉన్నవి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ కన్వర్టెడ్ గిరిజన గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పీజీటీ ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల విద్యార్థులకు విద్య దూరమవుతోందని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలని, గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాలని, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ ప్రధాన కార్యదర్శి పి.రాజకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరాజు, నాయకులు వెంకటేశ్వర నాయక్, జాన్ వీస్లీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినతి పత్రాన్ని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ సదా భార్గవికి అందజేశారు.



ఆందోళన చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని గూడ్స్ రైల్వేస్టేషన్ పరిధిలో పట్టాలపై పడి ఉన్న గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని రైల్వే సిబ్బంది మంగళవారం గుర్తించారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 25 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం పట్టాలపై బోర్లా ఉందన్నారు. మృతదేహం ముఖంపై గాయాలు గుర్తించమన్నారు. నల్ల రంగు టీ షర్ట్ ధరించినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు పడ్డాడా, ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది విచారణలో తెలుస్తుందన్నారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ సీఐ రమణ తెలిపారు. మృతదేహాన్ని విజయవాడలోని రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.



తిరువూరు

• తిరువూరు • మైలవరం

బాధితులందరికీ పరిహారం అందజేస్తాం



కొటికలపూడి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: వరద నష్టం అంచనాలు పూర్తయిన వెంటనే బాధితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని ఎవరూ అధైర్యపడవద్దని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. మండలంలోని కొటికలపూడిలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరదల వల్ల గ్రామంలోని పొలాల్లో వేసిన ఇసుక మేటలు తొలగించేందుకు అధికారులతో చర్చించి బాధిత రైతాంగానికి చేయూతనిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వరద బాధితులకు అన్యాయం జరిగిందని.. నేడు కూటమి పాలనలో వరదల్లో మృతి చెందిన వారికి వెంటే నష్టపరిహారం అందజేశామన్నారు. అందుకే ఇది మంచి ప్రభుత్వం అయిందన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అక్కల గాంధీ, నూతలపాటి బాలకోటేశ్వరరావు మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు డీడీ అందజేస్తున్న జెన్‌కో కాంట్రాక్టర్లు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కోకు చెందిన ఎన్టీటీపీఎస్ కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3 లక్షలు అందించారు. అందుకు సంబంధించిన డీడీని మంగళవారం కాంట్రాక్టర్ల ప్రతినిధి జాస్తి శరత్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వెలగపూడిలోని ఆయన కార్యాలయంలో కలిసి అందజేసినట్లు వారు తెలిపారు.

'జగన్ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పారు'



విస్సన్నపేట : కొర్లమండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో జగన్ సాగించిన అరాచకాలతో విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధిచెప్పారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను మండలంలోని కొర్లమండలో ఇంటింటికీ అందజేశారు. ప్రజల సమస్యలు తెలిసుకొని ఆదుకుంటానని వారికి హామీ ఇచ్చారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.80 లక్షల విరాళం



ఆలయ ధర్మకర్త, సభ్యులతో దాతలు

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో 400 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన మన్నే మణికుమార్, వెంకటరమణ, సత్యనారాయణ తమ తల్లిదండ్రులు లక్ష్మీకాంతం, సాంబశివరావు జ్ఞాపకార్థం రూ.1.80 లక్షల విరాళం అందించారు. మంగళవారం ఈ మొత్తాన్ని ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. అనంతరం తాత్కాలిక మండపంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రతిపాదించారు.. పక్కన పెట్టారు

★ రెండు దశాబ్దాలుగా ఉలుకూ పలుకూలేదు

★ తరచూ ఆక్రమణల తొలగింపుతో అవస్థలు



ఆటోనగర్ ఏర్పాటుకు గతంలో కేటాయించిన జడ్పీ ఉన్నత పాఠశాల స్థలం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటు ప్రక్రియ రెండు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. స్థల పరిశీలన జరిగి ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో కార్మికులు వీధిన పడాల్సిన దుస్థితి నెలకొంది. బైపాస్‌రోడ్డులో జాతీయ రహదారికి ఇరువైపులా ఖాళీ జాగాల్లో షెడ్డు వేసుకుని ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, ట్రాక్టర్ల మరమ్మతులు, వెల్డింగ్, పంక్చర్ వంటి చేతివృత్తులతో కార్మికులు జీవనం సాగిస్తున్నారు. వీటి ఆధారంగా మరికొందరు తోపుడు బండ్లు, బడ్డీకొట్లు, టిఫిన్, టీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని బతుకీడుస్తున్నారు. గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అధికారులు ఆక్రమణలు తొలగించడంతో 200 మందికి పైగా కార్మికులు రోడ్డునపడ్డారు. అప్పట్లో ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చిన నాయకులు సుందరయ్యకాలనీకి వెళ్లే మార్గంలోని నాళ్లా నారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్థలాన్ని లీజు ప్రాతిప్రదికన కార్మికులకు ఇచ్చేందుకు ప్రతిపాదించారు. ఏళ్లు గడిచినా ఆటోనగర్ ఏర్పాటు మాత్రం కలగానే మిగిలింది.

మళ్లీ రోడ్డున పడిన కార్మికులు

మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో కార్మికులు తిరిగి అదే స్థలాల్లో షెడ్లు వేసుకుని చేతివృత్తులు కొనసాగిస్తున్నారు. ఇటీవల పురపాలక సంఘం అధికారులు మరోసారి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టడంతో కార్మికులు మళ్లీ రోడ్డున పడాల్సి వచ్చింది. గతంలో ప్రతిపాదించిన జడ్పీ స్థలాన్ని లీజు పద్ధతిలో ఆటోనగర్‌కు కేటాయిస్తూ మండల పరిషత్‌లో తీర్మానాన్ని జిల్లా పరిషత్‌లో ఆమోదించాల్సి ఉంది. ఎనిమిదేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వంలో కొలిక్కి వస్తున్న తరుణంలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి చేపట్టిన వాణిజ్య దుకాణాల సముదాయానికి అడ్డంకిగా మారుతోందని కొందరు నాయకులు మోకాలడ్డు వేశారు. ఫలితంగా ఆటోనగర్ ఏర్పాటు చివరి నిమిషంలో నిలిచింది. అప్పటి నుంచి కార్మికులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కలిసిన కార్మికులు తమ సమస్యను మరోసారి మొరపెట్టుకున్నారు. కనీసం ప్రస్తుత ఈ ప్రభుత్వంలోనైనా తమకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేత్రదానం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని రాజుపేటకు చెందిన చిలుకూరి లలితకుమారి మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు తిరువూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులను సంప్రదించారు. వారి సమాచారం మేరకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు లలితకుమారి నుంచి కార్నియాలు సేకరించారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

తిరువూరు, న్యూస్‌టుడే: చిన్నపిల్లలు, కిశోర బాలికల్లో నులిపురుగులు నివారించడం వల్ల మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారిణి డాక్టర్ రేష్మాబేగం తెలిపారు. స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నులిపురుగుల నివారణ మందులను సిబ్బందికి అందజేశారు. సూపర్‌వైజర్ కె.రవి, హెల్త్ విజిటర్ ఎస్‌కే ఆషాబీ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తిరువూరు: పల్లెల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో పి.నాగేశ్వరరావు ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీశారు



ఎస్సై శ్రీనుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న హిందూ సంఘాల నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో జరిగిన అపచారానికి బాధ్యులైన వారిపై సత్వరమే చట్టపరంగా విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గంపలగూడెంలో నిరసన ప్రదర్శన చేశారు. కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎస్.శ్రీనుకు ఫిర్యాదు పత్రం అందజేశారు. కూటమి నాయకులు ఎ.క్రాంతికుమార్, వి.సుజాత, ఎన్.యుగంధర్, ఎల్.హరీష్, ఆర్.శ్రీనివాసరావు, కె.రవికుమార్, ఎల్.రామకృష్ణ, ఎ.సూర్యప్రకాశ్, జి.ఫణికుమార్ పాల్గొన్నారు.

నెయ్యి కల్తీకి పాల్పడిన వారిని శిక్షించాలి



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న జనసేన నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన మండల నాయకులు మంగళవారం మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామిని ఆలయ మెట్లపై మోకాళ్లపై నడిచి దర్శించుకున్నారు. గత వైకాపా పాలనలో భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. నాయకులు సీహెచ్.వెంకటకృష్ణారావు, సీహెచ్.సత్యనారాయణ, జె.రామకృష్ణ, బి.బాలకృష్ణ, వి.కృష్ణ, హెచ్.సంపత్‌కుమార్, ఎస్.రామారావు, ఒ.సురేష్, ఎస్‌కే.నాగుల్‌మీరా, పి.తిరుమలరావు మెట్లపై మోకాళ్లపై నడిచారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



శాంతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కూటమి నాయకులు



రాజగోపాలస్వామి దేవాలయం ఎదుట నాయకులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ పవిత్రత పునరుద్ధరణకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ మేరకు ఆయన కేతనకొండలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన శాంతి పూజలో పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యులు అక్కల రామ్మోహనరావు, జనసైనికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన దీక్షకు సంఘీభావంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండల జనసేన అధ్యక్షుడు వై.నరసింహారావు, నాయకులు బుల్లా రాజు, గణేష్, ఇందిరాప్రియదర్శిని, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న దీక్షకు సంఘీభావంగా రెడ్డిగూడెం శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో జనసేన నాయకులు శ్రీ అభయ ఆంజనేయ స్వామికి మంగళవారం పూజలు చేశారు.

'పొలం పిలుస్తోంది' ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మండలంలోని వెంకటాపురం గ్రామ రైతు సేవ కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలవరం వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ అకాల వర్షాలకు జి.కొండూరు మండల వ్యాప్తంగా 5,705 ఎకరాల వరి, 3,567 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు పరిగణనలోకి తీసుకున్నామన్నారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ పంట దెబ్బతిన్న రైతులు వ్యవసాయశాఖ అధికారులు సూచించే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ యు.నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు వై.విజయశ్రీ, ఏవో ఎం.రాంకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎ.కొండూరు : వల్లంపట్లలో ఎరువుల మిశ్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతుకు సాంకేతిక సలహాలు అందించడమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం: వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు సూచనలు అందించి వారికి అవసరమైన వనరులను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడమే పొలం పిలుస్తోంది కార్యక్రమ ప్రధాన లక్ష్యమని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.శైలజ పేర్కొన్నారు. మండల పరిధిలో దాములూరు, ఈలప్రోలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

వల్లంపట్ల(ఎ.కొండూరు): భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వేయాలని, మిశ్రమ ఎరువులను తగ్గించి యూరియా, పొటాష్ దశల వారీగా వేయాలని జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకురాలు టి.మాధవీలత రైతులకు సూచించారు. మండలంలోని వల్లంపట్లలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి వరి పంటను, వినియోగిస్తున్న మిశ్రమ ఎరువులను పరిశీలించారు. ఏడీఏ జి.కెనడీ, హెచ్‌వో బి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగం మార్పులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వి.వంశీకృష్ణ

మైలవరం, న్యూస్‌టుడే: బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మైలవరం బ్రాంచి సీనియర్ మేనేజర్ వి.వంశీకృష్ణ సూచించారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విభాగంలో బ్యాంకింగ్ సర్టిఫికెట్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. ఇందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీకాం విద్యార్థులు బ్యాంకింగ్ రంగంలో మార్పులు, డిజిటల్ చెల్లింపులు, నెట్‌బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్‌కార్డుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉప ప్రిన్సిపల్ టి.రంగారావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ప్రతిభ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ ఆటల పోటీల్లో గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల బాలబాలికలు మూడు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించినట్లు వ్యాయామోపాధ్యాయుడు బంకా రాంబాబు తెలిపారు. రెండు రోజులపాటు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆటల పోటీలు మంగళవారంతో ముగిశాయి. వాలీబాల్ బాలుర సీనియర్స్, ఖోఖో బాలుర జూనియర్స్, కబడ్డీ బాలికల జూనియర్స్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. త్వరలో తిరువూరులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆయా విభాగాల్లో మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.



కబడ్డీ జూనియర్స్‌లో ప్రథమ స్థానం సాధించిన బాలికలు

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: విస్సన్నపేటకు చెందిన కట్ల నాగేశ్వరరావు బ్రెయిన్ సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చొరవతో రూ.4 లక్షలు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఆయా చెక్కును ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం: కేతనకొండ గ్రామానికి చెందిన వి.లక్ష్మమ్మ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.67 వేల ఆర్థిక సహాయ చెక్కును ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రభుత్వ పరిశీలనలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు



అగ్నిమాపకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తాజాగా ప్రతిపాదించిన నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం అగ్నిమాపక శాఖకు రూ.250 కోట్లు కేటాయించిందని.. ఈ మొత్తంతో నూతన కేంద్రాల ఏర్పాటు, వాహనాలు సమకూర్చుకునే వీలుందన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి భరత్‌భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థ పాలన చంద్రబాబుకే సాధ్యం



తిరువూరు : మునుకుళ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే: సమర్థవంతమైన పాలన సీఎం చంద్రబాబుకే సాధ్యమని విజయవాడ వరదల సందర్భంగా తేటతెల్లమైందని తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు వి.వెంకటనర్సిరెడ్డి తెలిపారు. మండలంలోని మునుకుళ్లలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన పథకాలను వివరించారు. స్థానిక 3వ వార్డులో తెదేపా నాయకులు నిరంజన్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



అన్నేరావుపేటలో ..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రజలకు సంక్షేమాలు అందజేస్తున్నారని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం అన్నేరావుపేట పంచాయతీలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టం పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ సూచించారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ లక్ష్యం చేరుకునే దిశగా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. బాలికలకు రక్షణ కల్పిస్తూ ఉన్న చట్టాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాకదాని లక్ష్మీనారాయణ, షేక్ గౌసీద్దీన్, న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, మేకల నాగేంద్రప్రసాద్, రాజవరపు శ్రీనివాసరావు, భూక్యా రాము తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ఆరోగ్యానికి నష్టం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వాడకంతో ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని స్థానిక సంజీవని ఆసుపత్రి వైద్యురాలు బొగ్గవరపు దివ్య తెలిపారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్తు పదార్థాలు - యువతపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

మమ్మల్నీ వరద నష్ట జాబితాలో చేర్చండి



పుర కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, జగనన్న కాలనీ వాసులు ధర్నా

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి జగనన్న కాలనీ వాసులను వరద నష్ట జాబితాలో చేర్చాలని సీపీఎం నాయకుడు మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండపల్లి పురపాలిక కార్యాలయం వద్ద మంగళవారం కాలనీ వాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మొదటి నుంచి కాలనీ వాసులు 15 రోజుల పాటు వరద నీటిలో మగ్గిపోయారని.. నేటికి వీధి లైట్లు, తాగునీరు లేవన్నారు. వరద నష్ట పరిహారం నమోదు చేసే అధికారులు పక్షపాతం చూపారని.. ఆధార్‌కార్డు మ్యాప్ అవ్వలేదని అత్యధిక మందిని ఆ జాబితాలో లేకుండా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో వాసు, బాలాజీ, వర్మ, వీరయ్య, దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలపై తీగలు.. చోరుల పాలు

రూ.60 లక్షలకు పైగా ప్రజాధనం వృథా

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి జగనన్న కాలనీలో రూ.లక్షలు విలువ చేసే విద్యుత్తు తీగలు చోరీకి గురవుతున్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజాధనం వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. జగనన్న కాలనీకి విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు ఓ గుత్తేదారు సంస్థ సబ్‌స్టేషన్‌ను, కిలోమీటర్ల మేర స్తంభాలు ఏర్పాటు చేసి వాటికి విద్యుత్తు తీగలు అమర్చారు. చిన్న చిన్నవి మినహా అన్నీ పనులు పూర్తయ్యాయి. పేదలకు మెరుగైన విద్యుత్తు సౌకర్యం కల్పించే క్రమంలో సీపీడీసీఎల్‌కు దానిని అప్పగించడమే తరువాయి. కానీ కొన్నాళ్లకు అక్కడి పనులు ఆగిపోయాయి. ఇదే చోరులకు అనువుగా మారింది. స్తంభాలపై తీగలకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో మొదట్లో కొంత మేర తీగను అపహరించారు. గుత్తేదారు సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం, సీపీడీసీఎల్ సిబ్బందికి ఆ విషయం అవసరం లేకపోవడంతో దొంగలు తమ ప్రభావాన్ని చూపించారు. దాదాపు 100 కిలోమీటర్ల పొడవైన విద్యుత్తు అల్యూమీనియం తీగలను స్తంభాల పై నుంచి కత్తిరించి దోచుకెళ్లారు. కాలనీలో మెరుగైన విద్యుత్తు సౌకర్యం కల్పించాలంటే ప్రభుత్వం మరలా ప్రజాధనం వెచ్చించి మరో టెండర్ ద్వారా ఆ పనులు చేయించాల్సి ఉంది.



చోరీకి గురైన తరువాత విద్యుత్తు స్తంభాలు ఇలా

చోరీ విషయం తెలిసి ఫిర్యాదు చేశాం: సహాయక ఇంజినీర్ సుబ్బారావు

కాలనీలో విద్యుత్తు సబ్‌స్టేషన్, స్తంభాలు, తీగల ఏర్పాటు ఓ సంస్థ నిర్వహిస్తోంది. ఆ పనులు పూర్తి అయిన తరువాత డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాల్సి ఉంది. గత వారంలో అత్యవసర పనుల నిమిత్తం ఈలప్రోలు వద్ద మా సిబ్బంది పనులు చేస్తున్నారు. ఆ సమయంలో కొందరు విద్యుత్తు తీగలతో వెళ్లడం గమనించారు. వారిని నిలువరించి ఆరా తీశారు. అనంతరం తీగలు చోరీలకు గురవుతున్నాయని పోలీసులకు సమాచారం ఇచ్చాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

❖ క్రీస్తురాజపురం అరుణ్‌నగర్, ఆర్‌సీఎం చర్చి ప్రాంతాల్లో తాగునీటి పైపులు లీకవుతున్నా యని స్థానిక నివాసి రత్నాకర్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

స్పందనకు వందనం

? కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ డాబా కొట్లు బజారులో చెత్త తిష్ఠ వేసింది. దుర్వాసన భరించలేకున్నాం. **- ఆర్.నాగేశ్వరరావు**

✔ చెత్త తొలగిస్తాం **- దానయ్య, శానిటరీ అధికారి.**
- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: తీగల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు క్రీస్తురాజపురం, ఆర్‌సీఎం చర్చి, కొండప్రాంతం, సింహాచలం అపార్టుమెంట్లు, విధుల నగర్, ఆర్.పి.టవర్స్, ఎల్ఐసీ కాలనీలో కొంత భాగం, అమ్మ కల్యాణ మండపం, సున్నపు బట్టీల సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని అధికారి పి.హరిబాబు తెలిపారు.

విజయవాడ తూర్పు

ఖాళీ జాగా.. ఆకతాయిల పాగా

☛ ఇబ్బంది పడుతున్న స్థానికులు
☛ కొరవడిన పోలీసుల నిఘా

పటమట, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. తాగిన మైకంలో కొందరు యువకులు వాళ్లలో వారే గొడవ పడుతున్నారు. స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. పటమట అంబేడ్కర్ నగర్‌లోని దేవాదాయ శాఖ భూమిని అడ్డాగా చేసుకుని కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కృష్ణలంక, యనమలకుదురు, పటమట తదితర ప్రాంతాల నుంచి తాగుబోతులు, గంజాయి తాగేవారు ఈ స్థలంలోకి అక్కడికి చేరుకుంటున్నారు. ఆ స్థలంలోని వేప చెట్టు కింద ఉంటూ అర్ధరాత్రి వరకు తాగుతూ నానా రచ్చ చేస్తున్నారు. గొడవ పడుతున్నారు.


అంబేడ్కర్ నగర్‌లోని దేవాదాయ శాఖ స్థలం

మత్తులో మద్యం సీసాలను పగలకొడుతున్నారు. సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల వైపు వాటిని పడేస్తున్నారు. మారుమూల కావడంతో ఆ ప్రాంతం వైపు ఎవరూ పెద్దగా రాకపోకలు సాగించడం లేదు. దానిని ఆసరాగా తీసుకొని వాళ్లందరూ అక్కడికి చేరుకుంటున్నారు. ఎప్పుడైనా పోలీసులు వస్తే వెంటనే పక్కన ఖాళీ ఇళ్లల్లోకి దూకి పారిపోతున్నారు. ఆ స్థలం వైపు స్థానికులు వెళ్లకపోయినా.. చుట్టుపక్కల ఇళ్లలో ఉండేవారు మాత్రం వారి ఆగడాలతో అవస్థలు పడుతున్నారు.

భయపడుతున్నాం

అంబేడ్కర్‌నగర్‌లోని దేవాదాయ శాఖకు చెందిన భూమి మారుమూలగా ఉంది. ఆ ప్రాంతంలో నిఘా ఉండట్లేదు. యువకులు సాయంత్రం కాగానే క్రికెట్ పేరుతో అక్కడికి చేరుకుంటారు. మద్యం, గంజాయి తెచ్చుకుని తెల్లవార్లూ అక్కడే ఉంటున్నారు. చీకటి పడితే అటు వైపు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. పోలీసులు పెట్రోలింగ్ పెంచి, మా కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు అదుపు చేయాలని కోరుతున్నాం. **- అశోక్, స్థానికుడు**

ప్రశ్నిస్తే.. గొడవకు దిగుతున్నారు

తాగిన మైకంలో యువకులు గొడవ పడుతున్నారు. అర్ధరాత్రి ద్విచక్రవాహనాల శబ్దం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆ మైదానంలో ఎక్కడ చూసినా మందు సీసాలే కనిపిస్తున్నాయి. తాగిన సీసాలను పక్కన ఇళ్లలోకి విసురుతున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే గొడవ పడుతున్నారు. ఆకతాయిలతో గొడవలు ఎందుకులే అని ఎవరికి వారు పట్టించుకోవడం లేదు. పోలీసులు నిఘా పెంచి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. **- నాగేశ్వరరావు, స్థానికుడు**

పట్టణ ప్రణాళికాధికారులు బదిలీ

విజయవాడ నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ప్రణాళికాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని విజయవాడలో నియమిస్తూ.. ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు. ✶ పాత బస్తీ పరిధిలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఆశను ఉయ్యూరు బదిలీ చేశారు. ✶ పూర్ణానందంపేటలో విధులు నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి కె.అరుణను తాడిగడప పురపాలక సంఘానికి బదిలీ చేశారు. ✶ సత్యనారాయణపురం టౌన్‌ప్లానింగ్ అధికారి వి.ఎం.వి.రమణారెడ్డిని ఎర్రగుంట్ల పురపాలక సంఘానికి పంపించారు. ✶ భవానీపురం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎ.వెంకటేశ్వరరావును ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ✶ మైదుకూరు టౌన్‌ప్లానింగ్ అధికారి జి.కృష్ణ, గుడివాడలో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.రాంబాబును విజయవాడ నగరపాలక సంస్థకు బదిలీ చేశారు.

వరద బాధితులందరికీ సాయం అందించండి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని కలెక్టర్ జి.సృజనను వైకాపా నేతలు కోరారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆసిఫ్ తదితరులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 119, 159, 194 వార్డు సచివాలయాల్లో సహా సెంట్రల్‌లోని కొన్ని ప్రాంతాల్లో సర్వే బృందాలు వివరాలు సేకరించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వరద తీవ్రతకు కొందరు వేరే ఊళ్లలో తలదాచుకున్నారని, కొందరు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నారని, వారందరినీ దృష్టిలో ఉంచుకుని ఎన్యూమరేషన్ గడువు మరో వారం పొడిగించాలని కోరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని అన్నారు.

కాలువ గట్ల సుందరీకరణ : కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు కాలువ గట్ల సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు నగరపాలక


అధికారులకు సూచనలిస్తున్న ధ్యానచంద్ర

సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రామలింగేశ్వరనగర్, బందరు కెనాల్, పీసీఆర్ జంక్షన్, సింగ్‌నగర్, జక్కంపూడికాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా కెనాల్ బండ్స్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బందరు, ఏలూరు కాలువ గట్లను పూర్తిగా పచ్చదనంతో నింపడమే కాకుండా వాకింగ్ ట్రాక్‌లు, ఆట పరికరాలు, వ్యాయామాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు యూనిడో ప్రాజెక్టు కింద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఆధునికీకరణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఆయా ప్లాంట్లలో వేగం పెంచాలని అధికారులను సూచించారు. నగరంలో ఏడు ఎస్టీపీ ప్లాంట్లు ఉండగా, అజిత్‌సింగ్‌నగర్‌లో మరో ప్లాంట్ నిర్మించి మురుగునీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్, జక్కంపూడి ఎస్టీపీ ప్లాంట్లలో మురుగు నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా ట్యాంకులు నిర్మిస్తున్నామని వెల్లడించారు. అధికారులు కె.వి.సత్యవతి, శ్రీరామచంద్రమూర్తి, రామ్మోహనరావు, ఏఎస్ఎన్.ప్రసాద్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పారిశుద్ధ్య పనులు చేశారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు నిర్వహించారు. బెంజిసర్కిల్ పైవంతెన కింద ఆంధ్రా లయోలా కళాశాల విద్యార్థులు వ్యర్థాలు తొలగించారు. పటమట పంట కాలువ రోడ్డు నారాయణ, భవానీపురం సెయింట్ జాన్స్, తూర్పులోని ఎన్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు రత్నావళి, ఓబేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కమిషనర్ ఆదేశాల మేరకు అయ్యప్పనగర్, తూర్పులోని పలు ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రణాళికాధికారులు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రంపై అవగాహన కల్పించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దార్శనిక పత్రంపై ప్రజలు తమ అభిప్రాయాలను నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారి వసీం బేగ్, కార్పొరేటర్ పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిల్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. వేతన బకాయిలు అందక ఇబ్బంది పడుతున్న కార్మికులతో కలిసి ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. మార్చి నుంచి జూన్ వరకు వేతన బకాయిలు నేటికీ చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పూర్తయిన వెంటనే కార్మికులను తొలగించడం అన్యాయమని ఆవేదన చెందారు. ప్రధాన కార్యాలయంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సైతం గుత్తేదారు సంస్థ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. వారికి కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్(పి) కె.వి.సత్యవతికి వినతి పత్రం అందించారు.


అదనపు కమిషనర్(పి) కె.వి.సత్యవతికి సమస్య వివరిస్తున్న సీపీఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

☛ బుడమేరు వరదలతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైనందున ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి బాధితుల ఇబ్బందులపై చర్చించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మేయర్ రాయన భాగ్యలక్ష్మిని కోరారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు.

ప్రజలకు దగ్గరైన కూటమి ప్రభుత్వం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వంద రోజుల కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎంతో దగ్గరైందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 5వ డివిజన్ సున్నపు బట్టీల సెంటర్ మసీదు వీధి వద్ద 18వ సచివాలయం సిబ్బందితో కలిసి నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, పింఛను సొమ్ము పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, వరద ముంపు నుంచి బెజవాడను రక్షించడం.. .. చంద్రబాబుతోనే సాధ్యపడిందన్నారు. నాయకులు నందిపాటి దేవానంద్, గుమ్మడి గురుప్రసాద్, దోమకొండ రత్నాకర్, రమేష్, షరీఫ్, వివేక్, సన్నిధి ఆంజనేయులు, హనీఫ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న భవకుమార్, దేవానంద్ తదితరులు

గోతుల పూడ్చివేత



కరెన్సీనగర్: శివారు కాలనీలో తాగునీటి, భూగర్భ డ్రెయినేజీ కనెక్షన్ల నిమిత్తం తవ్విన గోతులతో ఇబ్బందిగా ఉందని 'తవ్వేసి...వదిలేసి' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దిద్దుబాటు చర్యలు చేట్టారు. కరెన్సీనగర్ ప్రధాన వీధి చర్చి వద్ద గొయ్యిని కాంక్రీట్‌తో పూడ్చించారు. కాలనీల్లో చాలా గోతులు ఇంకా దర్శనమిస్తున్నాయి. వాటి పైనా దృష్టి పెట్టాలని కాలనీ కమిటీలు కోరుతున్నాయి.

పంట నష్టపరిహారం పెంచండి

కృష్ణలంక, న్యూస్‌టుడే: పంట నష్ట పరిహారాన్ని వాస్తవ కౌలు రైతులకే ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి, ఈ-క్రాప్‌లో కౌలు రైతుల పేర్లను నమోదు చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ఆరోపించారు. వరద ప్రభావం, ప్రభుత్వ సహాయం, రైతు సంఘం నాయకుల సర్వేపై మంగళవారం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సంఘాల సభ్యులు విలేకరులతో మాట్లాడారు. రైతు, కౌలు రైతు సంఘాలు వరదల ప్రాంతాల్లో సర్వే చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుత వరదల కారణంగా పొలం నుంచి కనీసం ఒక్క వడ్ల గింజ కూడా ఇంటికి వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతు నిలబడాలంటే ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరితే. . ప్రభుత్వం కేవలం రూ.10 వేలు మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. వాణిజ్య పంటలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సరిపోదని అన్నారు. పంటలకు నష్టపరిహారాన్ని శాస్త్రీయంగా లెక్కకట్టి ఇవ్వాలని కోరారు. రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారిస్తాం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శివారు కాలనీల్లో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెడతామని, చోదకులు నిబంధనలు పాటించా


పవన్ కిషోర్, రమేష్ కుమార్‌లను సత్కరిస్తున్న కాలనీ ప్రతినిధులు

లని పటమట సీఐ పవన్ కిషోర్, ట్రాఫిక్ సీఐ ఎస్.రమేష్ కుమార్ అన్నారు. మూడో డివిజన్ కనకదుర్గ నగర్ జీఎన్ఆర్ భవనంలో మంగళవారం పోలీసు అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రామవరప్పాడు బల్లెం వారి వీధి నుంచి బాయన బాబూజీ వీధి మీదుగా హైటెన్షన్ రోడ్డుకు వచ్చే మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, చోదకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. సీఐలను కాలనీవాసులు సత్కరించారు. కనకదుర్గ నగర్, గణేష్ నగర్, కరెన్సీనగర్ కాలనీ ప్రతినిధులు జి.నారాయణరావు, యలమందరావు, రామ్మోహనరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వరద సహాయక చర్యల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర అభినందనీయమని ఆంధ్రా లయోల కళాశాల రెక్టార్ ఫాదర్ పి.ఆర్.జాన్ అన్నారు. జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్య ప్రాముఖ్యత ఎంతో ఉందని, ఆ దిశగా విద్యార్థులు శ్రమించాలని సూచించారు. సమాజ హితానికి దోహదపడాలని, విపత్కర సమయాల్లో సమష్టిగా బాధితులు ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శామ్యూల్ దయాకర్, క్లబ్ అధినేత ఎ.మనోజ్, సీనియర్ వాలంటీర్ లక్ష్మి, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన రాజకీయ నాయకుడు గద్దె

పటమట, న్యూస్‌టుడే: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, తన సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వంటి రాజకీయ నాయకులు చాలా అరుదుగా ఉంటారని సినీ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, బోయపాటి శ్రీను అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌లోని మూవీ టవర్స్‌కు ఎమ్మెల్యే దంపతులు మంగళవారం వెళ్లారు. అక్కడి సినీ ప్రముఖులు, మూవీ టవర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. భరద్వాజ మాట్లాడుతూ... గద్దె రామ్మోహన్ ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని, అందుకే విజయం సాధిస్తున్నారని అన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, గద్దె క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రామ్మోహన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దర్శకుడు బోయపాటి

ప్రతి ఆటోకి రూ.25 వేల పరిహారం ఇప్పించాలి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరదల్లో దెబ్బతిన్న ప్రతి ఆటోకి రూ.25 వేల చొప్పున పరిహారం ఇప్పించడంతో పాటు సర్వీస్ కంపెనీల్లో మరమ్మతులు వేగవంతం చేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావుకు ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీమా కంపెనీలు పెద్ద మనసుతో ఆలోచించి పూర్తి స్థాయిలో బీమా వచ్చేలా చూడాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని, బీ6, బీ4 వంటి ఆటోలకు ఆయా కంపెనీలు రూ.లక్ష వరకు ఎస్టిమేషన్ వేస్తున్నప్పటికీ బీమా కంపెనీలు పట్టించుకోకుండా... వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో తక్కువ మొత్తంలో ఇస్తామంటున్నాయని, అంగీకరించకుంటే పైసా కూడా రాదని కార్మికులను బెదిరించి సంతకాలు తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లలో ఉన్న ఆటోలకు ఫొటోలు తీయ లేదని, రికార్డులు ఫోర్స్‌లో లేవన్న సాకుతో కొన్ని కంపెనీలు బీమా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. నష్ట గణనలో వరద బాధిత కుటుంబాలతో పాటు మునిగిన ప్రతి ఆటోను నమోదు చేయాల్సి ఉండగా... ఎన్యూమరేషన్ అధికారులు ఇళ్లు మాత్రమే నమోదు చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. వివిధ ఆటో సంఘాల నాయకులు డి.శ్రీనివాసరావు, కె.దుర్గారావు, గరిమెళ్ల చిన్నా, పరమేశ్వరరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.


డీఆర్వో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆటో సంఘాల నాయకులు

మైనార్టీల మేలు కోరేది చంద్రబాబే

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వివిధ పథకాలు ప్రవేశపెట్టి ముస్లిం మైనార్టీలకు మేలు చేకూర్చారని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ అన్నారు. మొగల్రాజపురంలోని సమితి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... మైనార్టీల సంక్షేమంపై తాజాగా ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు ముస్లిం, మైనార్టీలకు ఎంతో ఆనందాన్ని కలిగించినట్లు తెలిపారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం కింద రూ.10వేలు, రూ.5వేలు, మసీదుల నిర్వహణ కోసం రూ.5 వేలు, హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష సాయంపై ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూఖ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు


సాధించిన ట్రోఫీలతో ఎన్.శ్రీధర్, ఎన్.శ్రీయాన్ష, బి.తనిసీసాయి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరులో ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకున్నారని జిల్లా, రాష్ట్ర పికిల్‌బాల్ సంఘాల కార్యదర్శి ఎన్.శ్రీధర్ తెలిపారు. ఓపెన్ మహిళల కేటగిరీలో వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌కి చెందిన ఎన్.శ్రీయాన్ష ప్రథమ, బి.తనిసీ సాయి ద్వితీయ స్థానాల్లో నిలవగా.. పురుషుల 35+ సింగిల్స్‌లో ఎన్.శ్రీధర్ ద్వితీయ, ఓపెన్ పురుషుల కేటగిరీలో ఎం.కుష్వంత్ సాయి ద్వితీయ, పురుషుల 50+ డబుల్స్‌లో జి.శ్రీనివాస్-వై.మల్లికార్జున్ జోడీ ప్రథమ, డీవీ రవీంద్ర-డాక్టర్ ఎల్.రవికాంత్ జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజయవాడ క్రీడలు: స్థానిక కేబీసీ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పలు పాఠశాలల బాలబాలికలు పోటీల్లో తలపడ్డారు. ప్రతిభగల క్రీడాకారులను విజయవాడ తూర్పు నియోజకవర్గ క్రీడా జట్లకు ఎంపిక చేశామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాజ్‌కుమార్ తెలిపారు. వారంతా త్వరలో జిల్లా స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక పోటీలో తూర్పు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వ్యాపార ఆలోచనలపై సదస్సు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలతో ఉత్పత్తులను తయారు చేసి కాలుష్య రహిత దేశంగా మార్చాల్సిన బాధ్యత యువతపై ఉందని రిసోర్స్‌పర్సన్ బి.ఎస్.లోకేశ్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్ విభాగాల ఆధ్వర్యంలో వ్యాపార ఆలోచనలపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం, రానున్న రోజుల్లో ఏ వ్యాపారమైతే బాగుంటుందనే ఆలోచన చేసి తరువాతే ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం లభించేవాటి కంటే నాణ్యతగల ఉత్పత్తులను అందుబాటు ధరల్లో ఇస్తేనే వ్యాపార రంగంలో రాణిస్తారని సూచించారు. ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం కూడా ఎంతో కీలకమన్నారు. ప్రిన్సిపల్ ఎస్.కల్పన, ప్రత్యేకాధికారి ఆర్.మాధవి, ఐఐసీ కన్వీనర్ అన్నపూర్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే సంక్షేమ పాలన


స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : తెదేపా హయాంలోనే పేద వర్గాలకు సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుమ్మడి గురుప్రసాద్ అన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మొగల్రాజపురంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమం స్టిక్కర్లను గురుప్రసాద్ ఆవిష్కరించారు. నాయకులు పటమట సతీష్ చంద్ర, సొంగా సంజయ్‌వర్మ, పెనుగొండ శ్రీనివాస్, రేపాకుల సాయి, దోమకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం

పటమట, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండడం అభినందనీయమని ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ కె.వీర్రాజు అన్నారు. మంగళవారం ఆదిత్య కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు శ్రీదేవి, ఐఆర్‌సీఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్ మోహన్ మాట్లాడారు. ఇన్నర్ వీల్ సభ్యులు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : కరోనా వచ్చిన తర్వాత ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అదే రీతిలో ప్రభుత్వాలు ఆరోగ్య సిబ్బందిని నియమించి, వివిధ వసతులు కల్పిస్తున్నాయని రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియంకేరీ అన్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫార్మాస్యూటికల్ ఎనాలసిస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆచంటి సునీత, సమన్వయకర్త ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పటమట, న్యూస్‌టుడే: మాచవరం డౌన్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ నివాసంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు ఒక విటుడు, ముగ్గురు బాధిత మహిళలను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మాచవరం సీఐ ప్రకాశ్ హెచ్చరించారు.

పరిశుభ్రతతో అద్భుత ఫలితాలు

పటమట, న్యూస్‌టుడే: పరిశుభ్రత నిరంతర ప్రక్రియగా కొనసాగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయని రాష్ట్ర కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ కాకరాల ప్రశాంత్ కుమార్ అన్నారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయ అధికారులు స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పటమట కోనేరు బసవయ్య చౌదరి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమం దేశభక్తితో చేపట్టినట్లు తెలిపారు. దేశాన్ని బాగు చేసేందుకు అందరూ ఏకమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అసిస్టెంట్ కమిషనర్లు జి.సీతారామరాజు, పి.నాగేశ్వరరావు, సీ.ఎ.ఒ. శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేస్తున్న కస్టమ్స్ ఉద్యోగులు

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

స్పందనకు వందనం

☛ పెనుగంచిప్రోలు లగడపాటి వెంకటేశ్వరరావు వీధిలో మురుగు కాల్వల శుభ్రం చేయాలని స్థానికులు 'ఈనాడు'లో మేమున్నాం మీకుతోడుగా ద్వారా సర్పంచి వేల్పుల పద్మకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె కార్మికులను పంపించి వీధిలోని పలు కాల్వలను శుభ్రం చేశారు.

☛ పెనుగంచిప్రోలులోని తుపాన్‌కాలనీకి తాగునీరు సరఫరాలో అంతరాయ విషయాన్ని 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సర్పంచి పద్మకుమారి దృష్టికి తీసుకుపోగా వెంటనే కాలనీకి నీటితో ఉన్న ట్యాంకర్‌ను పంపించారు.

☛ పెనుగంచిప్రోలు శింగవరం రోడ్డులో మురుగు కాల్వలు శుభ్రం చేయాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ దృష్టికి తీసుపోయారు. కార్మికులను పంపించి కాలువల్లోని చెత్త, వ్యర్థాలు తొలగించారు.

☛ నిలిచిపోయిన తాగునీటి సమస్య గురించి పడమర బజారు వాసులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం జేసీబీతో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. - న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

☛ లింగాలపాడు ఎస్సీ కాలనీలోని డ్రెయిన్లలో పూడిక తీయించాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు.

☛ కమ్మవారిపాలెం పోస్టాఫీసు బజారులోని డ్రెయిన్లలో మురుగు పారడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ సచివాలయ కార్యదర్శి ఆకుల హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించి మురుగు పారేలా చర్యలు తీసుకున్నారు.

☛ చెర్వుకొమ్ముపాలెం ఎస్సీ కాలనీలో ఎల్‌ఈడీ దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి జనార్దన్ కుమార్ దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఎల్‌ఈడీ దీపాలకు మరమ్మతులు చేయించారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

విద్యుత్తు లైన్‌మెన్ నియామకం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: గోళ్లమూడికి రెగ్యులర్ విద్యుత్తు లైన్‌మెన్‌ను నియమించారని తెదేపా గ్రామ అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో విద్యుత్తు లైన్‌మెన్ లేకపోవడం వల్ల వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. సమస్యను విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లడంతో లైన్‌మెన్‌గా బాషాను నియమించారు. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఎస్ఈ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. సహకరించిన ఎమ్మెల్యే తాతయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొణతమాత్మకూరు, పాతకంచల, రుద్రవరం, కొండూరు గ్రామాల్లో గత ఏడాది నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. రుద్రవరంలో రూ. 49.13 లక్షలు, కొణతమాత్మకూరులో రూ. 55.62 లక్షలతో చేసిన పనులను తనిఖీ చేశారు. సర్పంచులు కోటేశ్వరరావు, జాన్‌కోటయ్య, ఉపాధి హామీ ఏపీవో శరత్, తెదేపా నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దేవస్థానం ఈవో బాధ్యతల స్వీకరణ


ఈవో కిశోర్ కుమార్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఈవోగా నియమితులైన బీవీఎస్ఎన్ కిశోర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం

తిరువూరు: పట్టణంలోని రాజుపేటకు చెందిన చిలుకూరి లలితకుమారి మంగళవారం కన్నుమూశారు. నేత్రదానం చేసేందుకు కుటుంబ సభ్యులు తిరువూరు లయన్స్‌క్లబ్ సభ్యులను సంప్రదించారు. వారి సమాచారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు కార్నియాలు సేకరించారు.

మురుగు ముంపుతో ప్రజల అవస్థలు

సమస్యపై కౌన్సిల్‌లో చర్చించాలంటున్న స్థానికులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట పట్టణ వాసుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్న మురుగు సమస్య తీవ్రస్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో ప్రజలు సత్వర పరిష్కారం కోరుతున్నారు. ఈ వర్షాకాలం ఆరంభంలోనే జగ్గయ్యపేట ప్రాంతాన్ని కుదిపేసిన డయేరియా సమస్య ఎనిమిది మందిని పొట్టన పెట్టుకోగా.. ఈనెల మొదటి వారంలో వచ్చిన వరదలకు మురుగు సమస్యకు వరదలు తోడు కావడంతో సమస్య మరింత జటిలంగా మారింది. వరదలు వచ్చి తగ్గి నాలుగో వారం గడుస్తున్న ఇంకా వేపలవాగు, ఎర్ర కాల్వల విషయంలో ఎటువంటి ప్రక్షాళన చర్యలు జరగకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదల నేపథ్యంలో కొట్టుకుపోయిన పైపులైన్ల పునరుద్ధరణతో పాటు ఇతర ముఖ్యాంశాల కోసం బుధవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో వేపలవాగు, ఎర్ర కాల్వల్లో మురుగు తొలగింపు సమస్యపై చర్చించి సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇవే ఉదాహరణలు

★ తాజాగా పట్టణానికి చెందిన ఒక బాలుడికి వరద నీటి బ్యాక్టీరియా కారణంగా కాలు తీసేసిన పరిస్థితి వచ్చింది. దీంతో మురుగు సమస్య బాధితుల్లో భయాందోళనలు మరింత పెరిగాయి.

★ పట్టణంలోని సుమారు 7 వార్డుల గుండా ప్రవహించే ఈ రెండు కాల్వలు మొత్తం 10కి పైగా వార్డులను ప్రభావితం చేస్తాయి. పరిసరాల్లో పందుల సంచారం కూడా పెరగడంతో విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల పట్ల కూడా ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

★ ఈ అంశంపై కమిషనర్ రామ్మోహనరావును వివరణ కోరగా ఎర్ర కాల్వ, వేపలవాగుల పూర్తిస్థాయి ప్రక్షాళన విషయమై ఆయా శాఖల వారికి లేఖ రాస్తామని, అందులో మురుగు తొలగింపు, గుర్రపుడెక్క, తూడు తొలగింపుల గురించి బుధవారం సమావేశంలో చర్చించి యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగేలా చూస్తానని తెలిపారు.


ప్రభుత్వాసుపత్రి వెనుక ఎర్ర కాల్వ దుస్థితి


వేపల వాగు ఇలా..

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 25న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయాలని లింగాలపాడు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో భిక్షాలు మంగళవారం తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్యంతో ఉన్నవారికి మాత్రలు ఇవ్వొద్దని సూచించారు. 1-2 సంవత్సరాల వయసున్న చిన్నారులకు 1/2(సగం) మాత్ర ఇవ్వాలని తెలిపారు.

మట్టికుప్పలు తొలగించరూ!



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్లలో సిమెంటు రహదారిపై మట్టికుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారి నుంచి గ్రామానికి వచ్చే రహదారి పక్కన మురుగునీరు ప్రవహించేలా డ్రెయిన్ తవ్వి మట్టిని అలాగే వదిలేశారు. ప్రయాణికుల రాకపోకలకు అవి అడ్డుగా ఉన్నాయి. వాహనాలు తప్పుకోడానికి ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు రంగారావు వాపోయారు. మట్టిని తొలగిస్తామని గ్రామ సచివాలయ కార్యదర్శి జలీల్ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వత్సవాయి: మండలంలోని పోలంపల్లి సమీపంలోని మునేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. వత్సవాయికి చెందిన ఉప్పుతోళ్ల శ్రీకాంత్‌కు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

హానికర చెట్ల నరికివేత

జగ్గయ్యపేట: జగ్గయ్యపేటలో డివైడర్లపై పెంచిన కోనో కార్పస్ చెట్లు తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ప్రాణవాయువును విడుదల చేసే విషయంలో ఈ చెట్లు ఇతర వృక్షాలకు భిన్నంగా ప్రవర్తిస్తాయని నిపుణుల ద్వారా తెలుసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు కుట్ర

పల్లగిరి(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. పల్లగిరిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో పింఛను సొమ్ము పెంపు, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్‌యాక్టు రద్దు, మెగా డీఎస్సీ విడుదల, అన్న క్యాంటీన్ల ప్రారంభం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేను మహిళలు సన్మానించారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, నాయకులు వి. భిక్షాలు, మౌళేశ్వరరావు, షేక్ సాబ్జాన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య తదితరులు

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

నందిగామ గ్రామీణం: కేతవీరునిపాడుకు చెందిన పాడిరైతు దివంగత అనంతు రామకృష్ణ కుటుంబానికి విజయ డెయిరీ క్షీరబంధు పథకం కింద మంగళవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఇటీవల రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో అతని భార్య వెంకట్రావమ్మకు చెక్కు అందజేశారు. విజయ డెయిరీ మేనేజరు యశ్వంత్, జిల్లా డైరెక్టరు ఎన్.నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంద రోజులకే చక్కటి పాలన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వైకాపా రాక్షస పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. ప్రజా ప్రభుత్వం సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందిస్తోందని తెలిపారు. మంగళవారం స్థానిక మిట్టగూడెం బాలికోన్నత పాఠశాల వద్ద నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు పాలనలో ప్రజలకు అన్ని కోణాల్లో మంచే జరుగుతోందని అన్నారు. వంద రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. పింఛను మొత్తం పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాల చెల్లింపు చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టి నాగరాజు, సంగెపు బుజ్జి, కంచేటి గీతారాణి, గింజుపల్లి వెంకట్రావ్‌లతో కలిసి కరదీపికలను ఆవిష్కరించారు.


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

సీఎం సహాయనిధి అందజేత

జగ్గయ్యపేట: తొర్రగుంటపాలేనికి చెందిన తాళ్లూరి గోపాలకృష్ణ ఇటీవల ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయించిన రూ.7 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే తాతయ్య మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

★ పట్టణంలోని డాంగే నగర్‌కు చెందిన షేక్ జాఫర్ అనారోగ్యం కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల పత్రాన్ని తాతయ్య వారికి అందజేశారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే మేలు

వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని జగ్గయ్యపేట వ్యవసాయాధికారిణి సి. భవాని తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వత్సవాయిలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. పంటలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో గరికపాడు కేవీకే సమన్వయకర్త కృష్ణంరాజు, ఏవో రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పత్తి, వరి పంటలను పరిశీలన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సర్పంచి పద్మకుమారి, ఏవో రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బూదవాడ, బలుసుపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించినట్లు మండల అగ్రికల్చర్ అధికారి వి. వరలక్ష్మి తెలిపారు. వరి పంటలో జింక్ లోపం, ఆకుచుట్ట పురుగు, అగ్గితెగులు అధికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. పంటల్లో తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆకు చుట్టు పురుగు నివారణకు కోరాజిన్ 0.3 ఎంఎల్, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా పిచికారి చేసుకోవాలని తెలిపారు. పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి 4 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కట్టా వెంకట నరసింహారావు, కె. వి. కె ఎస్ఎంఎస్ వెంకటరెడ్డి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పంటలు పరిశీలిస్తున్న వరలక్ష్మి, అధికారులు, రైతులు

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు మంగళవారం రెండో రోజు నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, షటిల్, చెస్, యోగా పోటీల్లో వరుసగా మాగల్లు జడ్పీ, ఐతవరం జడ్పీ, కాకతీయ అపోలో, నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలల బాలికలు ప్రథమ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, షటిల్, చెస్, యోగా పోటీలు నిర్వహించగా.. వరుసగా నందిగామ జడ్పీ, ఐతవరం జడ్పీ, మాగల్లు జడ్పీ, కాకతీయ అపోలో, నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలల బాలికలు ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఎస్‌జీఎఫ్ పోటీల నియోజకవర్గ కోఆర్డినేటర్ పల్లపు శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ కల్యాణరాజు, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెనుగంచిప్రోలు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మంగళవారం పెనుగంచిప్రోలు జడ్పీ హైస్కూల్లో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎస్ఎంసీ పాఠశాల కమిటీ ఛైర్మన్ సముద్రాల రామారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. చదువుతో పాటు, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు సూచించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె. జలజ, ఎస్సై అర్జున్, వ్యాయామ ఉపాధ్యాయులు జి. వెంకటేశ్వరరావు, మురుకుట్ల శ్రీనివాసరావు, వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పెనుగంచిప్రోలు: ఆటల పోటీల ప్రారంభోత్సవంలో రామారావు, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి తదితరులు

చందర్లపాడు: తుర్లపాడు ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురకు మంగళవారం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను మండల జట్టుకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

విద్యార్థిని మృతిపై ఆసుపత్రిలో విచారణ

నందిగామ, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాల విద్యార్థిని కస్తాల అపర్ణ మృతి నేపథ్యంలో నందిగామ డీవీఆర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో అందించిన సేవలపై డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆదేశాల మేరకు మంగళవారం విచారణ చేశారు. సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్, ఎన్టీఆర్ జిల్లా డీసీహెచ్ఎస్ బీసీ నాయక్ విచారణ నిర్వహించారు. వైద్యులు, సిబ్బందిని విచారించారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటారని చెప్పారు. మంగళవారం 'ఈనాడు' దినపత్రికలో గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి శీర్షికన ప్రచురితమైన వార్తకు డైరెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. హుటాహుటిన అధికారులు వచ్చి విచారణ నిర్వహించారు. ఈ నెల ఎనిమిదో తేదీన బాలిక జ్వరంతో బాధ పడుతుండగా... వార్డెన్ వైద్యశాలకు తీసుకురాగా ప్రాథమిక చికిత్స చేశామని సూపరింటెండెంట్ సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 22న జ్వరం రాగా.. 23న వార్డెన్ తీసుకొచ్చి వైద్యశాలలో చేర్చారని చెప్పారు. బాలిక నీరసంగా ఉండటం వల్ల ఐ.వి. ఫ్లూయిడ్స్ పెట్టి చికిత్స చేశామని తెలిపారు. సాయంత్రం శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతుండగా.. పిల్లల వైద్యుడు పరిశీలించి విజయవాడ తీసుకెళ్లాలని సూచించారని, ఆ పరిస్థితుల్లోనే మృతి చెందినట్లు తెలిపారు.

'అసత్య ఆరోపణలు మానుకుంటే మంచిది'

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: తితిదే లడ్డూ ప్రసాదం విషయంలో వైకాపాను, మాజీ సీఎం జగన్‌ను విమర్శిస్తూ కూటమి నాయకులు చేస్తున్న విమర్శలను మానుకోవాలని వైకాపా నాయకులు చౌడవరపు జగదీష్, బద్దు నాయక్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ తదితరులు ఆక్షేపించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయస్థానంలో విచారణ జరిపిన తర్వాతే దీనిపై ప్రకటనలు చేయాలని, లేకపోతే హిందు మతాభిమానులు మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు.

గదుల నిర్మాణం ఎప్పుడో?

నిధుల కోసం ఎదురుచూపులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

మండలంలోని చిల్లకల్లులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చిల్లకల్లు పాఠశాలలోని కొంత భాగం హైవే విస్తీర్ణంలో పోతుందని, అదనపు గదుల కోసం జగ్గయ్యపేట రోడ్డులో 1.25 ఎకరం జడ్పీ స్థలాన్ని గత ప్రభుత్వం కేటాయించి అక్కడ 11 అదనపు గదులు నిర్మాణం చేపట్టారు. కానీ అవి అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. అదనపు గదుల నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 1.29 కోట్లు కేటాయించింది. వాటిలో రూ. 72 లక్షలతో అదనపు గదుల నిర్మాణం చేపట్టి పైకప్పులు నిర్మించారు. మిగతా రూ. 57 లక్షలు రావాల్సి ఉంది. ఈ గదులకు చుట్టూ ప్లాస్టింగ్, కిటికీలు, తలుపులు, స్టేషనరీ మొదలైనవి ఏర్పాటు చేయాలి. రావాల్సిన రూ. 57 లక్షల నిధులను కేటాయిస్తే పూర్తి నిర్మాణం పూర్తవుతోందని ప్రధానోపాధ్యాయులు వి. వి. ఎల్ వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో మొత్తం 328 మంది విద్యార్థులు ఉన్నారు. 165 మంది బాలురు, 163 మంది బాలికలు చదువుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పాఠశాలలో స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనుల్లో భాగంగా మరుగుదొడ్లు, తాగునీరు, బల్లలు తదితర పనులను పూర్తి చేశారు. ప్రధానోపాధ్యాయుడు వి. వి. ఎల్ వెంకటేశ్వరరావు సోదరుడు వి. వి. ఎల్ నరసింహారావు పేరు మీద పాఠశాలలో వంటగదిని సొంత నిధులతో కట్టించారు. పాఠశాలలో పాత ఇనుప వస్తువులను అమ్మి పాఠశాలకు 52 కుర్చీలు, 10 బల్లాలు చేయించామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.


నిర్మాణంలో అదనపు గదులు

ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు


వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో..

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో మంగళవారం నందిగామలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో కమిటీ సభ్యులు ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. కల్తీ నెయ్యి వాడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ కనగాల మోహనరావు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎం. కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎ. సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సువర్చలాంజనేయస్వామికి ...

జగ్గయ్యపేట: పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న స్వయంభూ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక అర్చనలు చేసి ఆకు మాలలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


జగ్గయ్యపేట: చెరువుకట్ట ఆలయంలో..

బకాయిలు వెంటనే చెల్లించండి

వత్సవాయి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ రీఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ (డీపీఆర్టీయూ) అధ్యక్షుడు డి. శ్రీను కోరారు. మంగళవారం వత్సవాయి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం కొనసాగించాలన్నారు. నిలిచిపోయిన నెల వారి పదోన్నతులు పునఃప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రభాకర్, నాయకులు ఆర్. భానుప్రసాద్, ఏ. శ్రీనివాసరావు, వై. మల్లేశ్వరరావు, బి. బుజ్జిబాబు, రవీంద్రనాథ్, మోంగియా నాయక్, పూర్ణయ్య, కిరణ్‌కుమార్, వెంకటప్పయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, నాయకులు

మత్తు పదార్థాలతో ఆరోగ్యానికి నష్టం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వాడకంతో ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని స్థానిక సంజీవని ఆసుపత్రి వైద్యురాలు బొగ్గవరపు దివ్య తెలిపారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్తు పదార్థాలు - యువతపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ పి. రాయప్ప, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు పిచ్చేశ్వరరావు, మధుసూదనరావు, అధ్యాపకుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ దివ్య

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన షేతపొంగు నాగేశ్వరరావు(29) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతుని కుటుంబానికి పెద్దవరానికి చెందిన కంపెన్షన్ కమ్యూనిటీ ఆఫ్ సర్వీసెస్ (సీసీఎస్పీ) సంస్థ రూ. 4 వేల ఆర్థిక సాయం అందజేసింది. సంస్థ అధ్యక్షుడు నరేంద్ర, సభ్యులు ప్రవీణ్, రామారావు పాల్గొన్నారు.

విజయవాడ పశ్చిమ

వరద బాధితులకు న్యాయం చేస్తాం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వరద నీరు ఇంట్లోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ గుర్తించి వారికి న్యాయం చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. కానూరులోని పశ్చిమ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి గట్టు వెనక ప్రాంత మహిళలు తమ డివిజన్లలో ఎన్యుమరేషను చేయలేదని, తమకు న్యాయం చేయాలని మంగళవారం గోడు చెప్పుకొన్నారు.


ఎమ్మెల్యే సుజనాచౌదరికి తమ గోడు తెలుపుతున్న మహిళలు

అధికారులతో మాట్లాడి ఎన్యుమరేషను ఎందుకు చేయలేదన్న విషయాన్ని తెలుసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమష్టిగా వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకోమని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మసాని సుబ్బారావు, పీతాని పద్మ, తమ్మిన లీలా కరుణాకర్, గన్ను శంకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబాలు

ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గట్టువెనక ప్రాంతంలో వరద బాధితుల వివరాలు నమోదు చేసిన సచివాలయ ఉద్యోగులు ఎన్యుమరేషను చేయకపోవడంపై జోక్యం చేసుకోవాలని వరద బాధిత మహిళలు భవానీపురంలోని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యాలయ సిబ్బంది వారి నుంచి వినతి పత్రం స్వీకరించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చినట్లు బాధిత కుటుంబ సభ్యులు శాంతి, లక్ష్మి, అనూరాధ, తిరపతమ్మలు తెలిపారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కమిషనర్ ఆదేశాల మేరకు అయ్యప్పనగర్, తూర్పులోని పలు ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రణాళికాధికారులు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రంపై అవగాహన కల్పించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దార్శనిక పత్రంపై ప్రజలు తమ అభిప్రాయాలను నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారి వసీం బేగ్, కార్పొరేటర్ పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద మిగిల్చిన గాయం

బుడమేరు వరద కారణంగా ప్రజలకు, ప్రభుత్వానికి ఎన్నో విధాలుగా నష్టం వాటిల్లింది. వేలాది గృహాలు నీటమునిగాయి. వరద కారణంగా ఏర్పడిన నష్టం నేటికీ వెంటాడుతుంది. ప్రభుత్వం ఆదుకుంటామని నష్టపరిహారం సైతం ప్రకటించింది. ఆ నష్టపరిహారం వస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని బాధితులు భావిస్తున్నారు.

భవానీపురం, న్యూస్‌టుడే

ఎన్నో విధాలుగా నష్టం

రహదారులు ధ్వంసం

వరద కారణంగా రహదారులు, కల్వర్టులు అనేకం దెబ్బతిన్నాయి. భవానీపురం పరిధిలోని ఊర్మిళా నగర్, ఎట్కిన్‌సన్ పాఠశాల, జోజినగర్, తదితర ప్రాంతాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. కొన్ని రోజుల పాటు రహదారులపై నీరు నిలిచి ఉండడంతో రాళ్లు కొట్టుకు వెళ్లాయి. నియోజకవర్గం వ్యాప్తంగా యాభై కిలోమీటర్ల మేర రహదారులు పాడైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.


ఊర్మిళానగర్ వద్ద దెబ్బతిన్న మార్గం


భవానీపురంలో రేషన్ దుకాణంలో తడిసిన బియ్యం

కార్యాలయాల్లోకి నీరు...

వరద కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోకి సైతం నీరు చేరింది. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాల్లో సామగ్రి దెబ్బతిన్నాయి. ఫర్నీచర్, కీలకమైన పత్రాలు తడిసిపోయాయి. భవానీపురం, విద్యాధరపురం, రాజరాజ్యనగర్, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది.

నివాసాల్లో పాడైన ఫర్నీచర్...

ప్రజల నివాసాల్లోని ఫర్నీచర్, గృహోపకరణాలు మంచాలు, పరుపులు, బీరువాలు తడిసిపోయాయి. ఫ్రిజ్, టీవీ, మిక్సీలు, కూలర్లు పాడైయ్యాయి. ముఖ్యంగా కింద అంతస్తుల్లో నివాసం ఉండే వారికి ఎక్కువగా నష్టం వాటిల్లింది. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దిగువ అంతస్తు పూర్తిగా నీట మునిగింది. దాదాపు 2 వేల వరకు దిగువ అంతస్తులు మునిగాయి.


బయట పడేసిన వస్తువులు

సాయం కోసం ఎదురుచూపులు


ఊర్మిళానగర్ వద్ద మంటల్లో సామగ్రి

విలువైన సామాగ్రి మంటల్లో ఆహుతి...

నివాసాల్లోని సామాగ్రి, ఇతర వస్తువులు తడిసి పాడవ్వటంతో రోడ్లపై పడేశారు. విలువైన వస్తువులు సైతం తడిసి పాడయ్యాయి. వాటిని పారిశుద్ధ్య సిబ్బంది తీసుకువెళ్లి తగలబెట్టేస్తున్నారు. విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఊర్మిళానగర్, తదితర ప్రాంతాల్లో వాటిని రోడ్లపై పడేసి తగలబెడుతున్నారు.

వాహనాలు ధ్వంసం: నియోజకవర్గం వ్యాప్తంగా వందలాది వాహనాలు పాడైయ్యాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలను రోడ్లపైనే ఉంచారు. దీంతో వరద కారణంగా వాహనాలు చాలా వరకు నీట మునిగాయి. దీంతో మెకానిక్ దుకాణాలకు పెద్ద సంఖ్యలో వాహనాలను తీసుకువచ్చి మరమ్మతులు చేయించుకున్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆటోలు పూర్తిగా మునిగాయి.

నష్టపోయిన వారందరికీ సాయం అందించండి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని కలెక్టర్ జి.సృజనను వైకాపా నేతలు కోరారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆసిఫ్ తదితరులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 119, 159, 194 వార్డు సచివాలయాలు సహా సెంట్రల్‌లోని కొన్ని ప్రాంతాల్లో సర్వే బృందాలు వివరాలు సేకరించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వరద తీవ్రతకు కొందరు వేరే ఊళ్లలో తలదాచుకున్నారని, కొందరు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నారని, వారందరినీ దృష్టిలో ఉంచుకుని ఎన్యూమరేషన్ గడువు మరో వారం పొడిగించాలని కోరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సక్రమంగా లేదని ఇళ్ల ముందు పడేసిన పనికిరాని వస్తువులను నేటికీ తొలగించలేదన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, విష్ణు, ఆసిఫ్, వెలంపల్లి తదితరులు

కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిల్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. వేతన బకాయిలు అందక ఇబ్బంది పడుతున్న కార్మికులతో కలిసి ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. మార్చి నుంచి జూన్ వరకు వేతన బకాయిలు నేటికీ చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పూర్తయిన వెంటనే కార్మికులను తొలగించడం అన్యాయమని ఆవేదన చెందారు. ప్రధాన కార్యాలయంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సైతం గుత్తేదారు సంస్థ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. వారికి కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్(పి) కె.వి.సత్యవతికి వినతి పత్రం అందించారు.

★ బుడమేరు వరదలతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైనందున ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి బాధితుల ఇబ్బందులపై చర్చించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మేయర్ రాయన భాగ్యలక్ష్మిని కోరారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందించారు.

కాలువ గట్ల సుందరీకరణ: కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు కాలువ గట్ల సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రామలింగేశ్వరనగర్, బందరు కెనాల్, పీసీఆర్ జంక్షన్, సింగ్‌నగర్, జక్కంపూడికాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా కెనాల్ బండ్స్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బందరు, ఏలూరు కాలువ గట్లను పూర్తిగా పచ్చదనంతో నింపడమే కాకుండా వాకింగ్ ట్రాక్‌లు, ఆట పరికరాలు, వ్యాయామశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు యూనిడో ప్రాజెక్టు కింద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ఆయా పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. నగరంలో ఏడు ఎస్టీపీ ప్లాంట్లు ఉండగా, ఆటోనగర్‌లో మరో ప్లాంట్ నిర్మించి మురుగునీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రామలింగేశ్వరనగర్, సింగ్‌నగర్, జక్కంపూడి ఎస్టీపీ ప్లాంట్లలో మురుగునీటి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా ట్యాంకులు నిర్మిస్తున్నామని వెల్లడించారు. అధికారులు కె.వి.సత్యవతి, శ్రీరామచంద్రమూర్తి, రామ్మోహనరావు, ఏఎస్ఎన్.ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఆర్థిక రంగంపై అవగాహన అవసరం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రణాళిక రూపొందించుకుంటే భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకుంటారని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ అండ్ మార్కెట్ నిపుణులు చిలుకూరి విజయ్‌కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక విద్య అనే అంశంపై కార్యశాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక రంగంలో చక్కని విజయాలను సాధించాలంటే ఆ రంగంలో ఉన్న అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. యువతకు ఆర్థిక విజ్ఞానం అవసరమన్నారు. ఆ దిశగా యువతను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పతంజలి శాస్త్రి, విభాగాధిపతి విజయ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళికాధికారుల బదిలీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ప్రణాళికాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని విజయవాడలో నియమిస్తూ.. ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు.

★ పాతబస్తీ పరిధిలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఆశను ఉయ్యూరు బదిలీ చేశారు.

★ పూర్ణానందంపేటలో విధులు నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి కె.అరుణను తాడిగడప పురపాలక సంఘానికి బదిలీ చేశారు. ★ సత్యనారాయణపురం టౌన్‌ప్లానింగ్ అధికారి వి.ఎం.వి.రమణారెడ్డిని ఎర్రగుంట్ల పురపాలక సంఘానికి పంపించారు. ★ భవానీపురం టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎ.వెంకటేశ్వరరావును ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ★ మైదుకూరు టౌన్‌ప్లానింగ్ అధికారి జి.కృష్ణ, గుడివాడలో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.రాంబాబును విజయవాడ నగరపాలక సంస్థకు బదిలీ చేశారు.

వైద్యశాలలో సౌకర్యాల లేమి?

ఇరుకు గదుల్లో వైద్యుల పాట్లు ★ వసతులు పెంచాలని ప్రజల ఆకాంక్ష

చిట్టినగర్, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గంలోని కొత్తపేటలో ఉన్న షేక్ రాజా సాహెబ్ వైద్యశాలలో వైద్య సేవలు మంచిగా ఉన్నప్పటికీ సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతుంది. వైద్యులు ఇరుకు గదుల్లోనే రోగులకు వైద్యం చేస్తున్నారు. ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు కూర్చునే పరిస్థితి నెలకొంది. రోజుకు ఆస్పత్రికి దాదాపు 450 వరకు ఓపీ ఉంటుంది. ప్రసూతి, పిల్లల, సాధారణ, దంత, మత్తు వైద్యులు, వైద్య విద్యార్థులు వైద్యం అందించేందుకు అసౌకర్యాల నడుమ వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రి బాగా ఇరుకుగా ఉండడంతో ఇబ్బందిగా ఉందని రోగులు వాపోతున్నారు.


ఓపీ కోసం నిల్చున్న రోగులు


మందుల కోసం ఇలా..

అంబులెన్స్ అవసరం

అత్యవసర వైద్యం కోసం షేక్ రాజా సాహెబ్ వైద్యశాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి రోగులను పంపించాలంటే అంబులెన్స్ అవసరం. గతంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పుడు అంబులెన్స్ ఉండేది. ఇప్పుడు మినీ జనరల్ ఆసుపత్రిగా స్థాయి పెరిగినా అంబులెన్స్ లేకపోవడం చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో రాలేని పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల ఓ వ్యక్తికి డెంగీ వచ్చి షేక్ రాజా సాహెబ్ వైద్యశాలలో చేరారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌కు రిఫర్ చేస్తే 108 వాహనం రావడానికి 40 నిమిషాలు పట్టింది.

ప్రాంగణమంతా కేటాయించాలి

షేక్ రాజా సాహెబ్ వైద్యశాలతో పాటు ఇదే ప్రాంగణంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఉనికిని కాపాడుకునేందుకు వైద్య సిబ్బంది షేక్ రాజా ఆసుపత్రికి వచ్చే రోగులను ఓపీగా చూపించుకునే పరిస్థితి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించి ఆ భవనాన్ని కూడా షేక్ రాజా సాహెబ్ వైద్యశాలకు కేటాయిస్తే మరింత మెరుగ్గా, వైద్య సిబ్బందికి, రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంటుంది. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, వైద్య విభాగం ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అప్పగించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


↑ పడకల గదిలో కిటకిట

బెడ్ల కొరత

ప్రస్తుతం ఉన్న 35 పడకలు ఉండడంతో చాలా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా గర్భిణులు ప్రసవించినప్పుడు, శస్త్రచికిత్స చేసినప్పుడు వారికి మంచాలు కేటాయించాలి. బెడ్ల కొరతతో అది సాధ్యం కావడం లేదని పేర్కొంటున్నారు. 100 పడకలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

హిందీ నేర్చుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

రైల్వేస్టేషన్,న్యూస్‌టుడే: హిందీ నేర్చుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు దేశంలో ఎక్కడైనా పని చేయవచ్చని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ అన్నారు. డివిజన్ అధికార భాషా అమలు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ హిందీలోనే జరిగేలా అన్ని విభాగాల అధికారులంతా కృషి చేయాలని కోరారు. డివిజన్‌లో రాజభాష అమలు తీరు సంతృప్తికరంగా ఉందని అధికారులను ప్రశంసించారు. సమావేశంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల, రాజభాష అధికారి ఎం.కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలో వరద బాధితులకు వైకాపా నాయకులు మంగళవారం సాయం అందించారు. హెచ్‌బీకాలనీలోని నగరపాలక సంస్థ కల్యాణ మండపంలో బాధితులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై అందజేశారు. వైకాపా నాయకులు పాల్గొన్నారు.

విజన్ 2047పై సమావేశం

భవానీపురం, న్యూస్‌టుడే: విజన్-2047లో భాగంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. మంగళవారం భవానీపురం ప్రియదర్శిని కాలనీలోని సామాజిక భవనంలో అధికారులు పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కీర్తన, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు రామయ్య, తిరుపతి అనూష తదితరులు పాల్గొన్నారు

ఎన్యుమరేషన్ చేయకపోవడం అన్యాయం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గట్టువెనక ప్రాంతంలోని 38, 39 డివిజన్లలో వరద నీటిలో రోజుల తరబడి ఉన్నా అధికారులు నష్టపరిహారం అంచనా వేయకుండా అన్యాయం చేశారని బాధిత కుటుంబాలు వాపోయారు. బాధిత కుటుంబాలను వైకాపా, సీపీఐ, సీపీఎం నాయకులు వేర్వేరుగా మంగళవారం పరామర్శించారు. తమకు న్యాయం చేసేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ భాగ్యలక్ష్మి, వైకాపా నాయకులు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఆసిఫ్, సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు, దుర్గాంబ, సీపీఎం నాయకులు బాబూరావు, కార్పొరేటరు సత్యబాబు తదితరులున్నారు.

ప్రజాపాలనలో కూటమి ప్రభుత్వం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం 49వ డివిజన్‌లో భాజపా కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజాపాలన అందించిందని కొనియాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించి వారి అభ్యున్నతికి పాటు పడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన ఉందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనంతరం 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టరును ఆవిష్కరించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శివాజీ, వీఆర్వో లివింగ్‌స్టన్, సచివాలయ అడ్మిన్ విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.


'ఇది మంచి ప్రభుత్వం' పోస్టరు ఆవిష్కరణలో కార్పొరేటర్ విజయ్‌కుమార్ తదితరులు

బాధితులకు సాయం సామాజిక బాధ్యత


దుప్పట్లు అందజేస్తున్న భారత్ గ్యాస్ దక్షిణ భారత జనరల్ మేనేజర్ పీయూష్ గుప్తా, రాష్ట్ర మేనేజర్ బాబ్జీ, గ్యాస్ కంపెనీల నిర్వాహకులు హరిబాబు, రాజేంద్ర, శంకర్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వరద బాధితులకు సాయం సామాజిక బాధ్యతగా భావించాలని భారత్ గ్యాస్ దక్షిణ భారత జనరల్ మేనేజర్ పీయూష్ గుప్తా అన్నారు. చెరువు సెంటర్ సమీపంలోని భవానీ గ్యాస్ కంపెనీ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వరద బాధితులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పీయూష్ గుప్తా మాట్లాడుతూ.. గ్యాస్ కంపెనీ నిర్వాహకులు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు గ్యాస్ వినియోగదారులకు ఉచితంగా స్టవ్‌లు మరమ్మతులు చేసేందుకు శిబిరాలు ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్ రాష్ట్ర మేనేజర్ బాబ్జీ, విజయవాడ మేనేజర్ వేణుగోపాల్, గ్యాస్ కంపెనీ నిర్వాహకులు గద్దె హరిబాబు, రాజేంద్ర, శ్రీనివాసరావు, శంకర్, అశోక్, ఇందిరాదేవి పాల్గొన్నారు.

అనధికారిక అంతస్తు తొలగింపు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలకు అడ్డు అదుపు ఉండడం లేదు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్యుమరేషన్, సేవలు అందించే పనిలో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఇదే తడవుగా అక్రమ నిర్మాణాలను కొందరు చేపడుతున్నారు. భవానీపురం ఆశ్రమం రోడ్డులో జీ+4 భవనం నిర్మాణం చేపట్టేందుకు ప్లాన్ తీసుకున్నారు. అధికారులు వరద హడావుడిలో ఉండడంతో అక్రమంగా మరో అంతస్తు నిర్మాణం చేపట్టారు. దీంతో నగరపాలక సంస్థకు రూ.లక్షల్లో మేర గండిపడింది. అనధికారిక నిర్మాణం చేపట్టారనే సమాచారం అందుకున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారి వెంకటేశ్వరరావు భవనంపైన ఉన్న నిర్మాణానికి రంధ్రాలు చేశారు.


భవనంపై రంధ్రాలు పెట్టిన అధికారులు

సాంకేతిక పరిజ్ఞానంతో విజయాలు సొంతం

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని విజయాలను సాధించవచ్చని ఎన్నారై కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అధ్యాపకురాలు జి.శోభన అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'డేటా మైనింగ్ టెక్నిక్స్ ఫర్ డెసిషన్ మేకింగ్' అనే అంశంపై సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ విభాగాల్లో నిర్ణయాలు తీసుకున్నప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే మరిన్ని కచ్చితమైన ఫలితాలు వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, విభాగాధిపతి హేమంత్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శోభన

స్వచ్ఛతపై అవగాహన

విజయవాడ నగరపాలక సంస్థ: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పారిశుద్ధ్య పనులు చేశారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు నిర్వహించారు. బెంజిసర్కిల్ ఫ్లైవంతెన కింద ఆంధ్రా లయోలా కళాశాల విద్యార్థులు వ్యర్థాలు తొలగించారు. పటమట పంట కాలువ రోడ్డు నారాయణ, భవానీపురం సెయింట్ జాన్స్, తూర్పులోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు రత్నావళి, ఓబేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

బాధితులందరికీ పరిహారం అందజేస్తాం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: వరద నష్టం అంచనాలు పూర్తయిన వెంటనే బాధితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని ఎవరూ అధైర్య పడవద్దని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. మండలంలోని కొటికలపూడిలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. వరదల వల్ల గ్రామంలోని పొలాల్లో వేసిన ఇసుక మేటలు తొలగించేందుకు అధికారులతో చర్చించి బాధిత రైతాంగానికి చేయూతనిస్తామన్నారు. గత ప్రభుత్వం హయాంలో వరద బాధితులకు అన్యాయం జరిగిందని.. నేడు కూటమి పాలనలో వరదల్లో మృతి చెందిన వారికి వెంటే నష్టపరిహారం అందజేశామన్నారు. అందుకే ఇది మంచి ప్రభుత్వం అయిందన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


చిట్టివేణి (పాత చిత్రం)

మండపేట, న్యూస్‌టుడే: భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదన్న కారణంతో ఓ వివాహిత మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని ఏడిద రోడ్డులో పోలేరమ్మ ఆలయ సమీపంలోని నివాసముంటున్న పిల్లే చిట్టివేణి (33)కి, విజయవాడకు చెందిన లారీ యజమాని దిరిశాల ప్రభుకుమార్‌తో 2021లో కులాంతర వివాహం జరిగింది. అనంతరం దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 18 నెలల కిందట తల్లి సూర్యావతి వద్ద వచ్చి ఉంటున్నారు. భర్త వేధింపులకు పాల్పడుతున్నట్లు కొద్దినెలల ముందు మండపేట పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. కాపురానికి తీసుకెళ్తానని భర్త చెప్పడంతో కేసు ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. సోమవారం రాత్రి కూడా వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం తల్లి ఇంట్లో లేని సమయంలో ఫ్యానుకు చున్నీతో ఉరేసుకుందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

విజయవాడ మధ్య

వరద బాధితులందరికీ న్యాయం : కలెక్టర్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ముంపు ప్రాంతాల్లో నష్టాన్ని 1500 బృందాలతో అంచనా వేసినట్లు కలెక్టర్ సృజన ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించినట్లు వెల్లడించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జిల్లా స్థాయి అధికారులతో రీ వెరిఫికేషన్ కూడా చేసినట్లు పేర్కొన్నారు. బాధితులందరికీ నష్ట పరిహారం అందించాలన్నదే లక్ష్యమని చెప్పారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఉండి.. మిగిలిపోయిన కుటుంబాలను కూడా జాబితాలో చేర్చినట్లు చెప్పారు.

పద్మశాలి కార్పొరేషన్ సభ్యుడిగా సింగం

మధురానగర్, న్యూస్‌టుడే : ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా మధురానగర్‌కు చెందిన సింగం వెంకటేశ్వరరావును నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన సింగం వెంకటేశ్వరరావును ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు. పక్కన మాల్యాద్రి, రాంబాబు, కోటేశ్వరరావు తదితరులు

20 సంవత్సరాలుగా సేవలు.. సింగం వెంకటేశ్వరరావు గత 20 సంవత్సరాలుగా తెదేపా సభ్యుడిగా ఉన్నారు. బీసీ సెల్ నాయకుడిగా పార్టీలో పలు పదవులు అలంకరించారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, సెంట్రల్ నియోజకవర్గ బీసీ సెల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గానూ పని చేశారు. తెదేపా ప్రతిపక్షంలో ఉన్నపుడు. . పార్టీని అంటి పెట్టుకుని ఉన్నారు. తాజా నియామకాల్లో పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సెంట్రల్ నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

గాంధీనగర్, న్యూస్‌టుడే : భారతీయ సనాతన ధర్మం, విలువలను కాపాడుకోవాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుపతి లడ్డూ ప్రసాదంపై నటుడు ప్రకాష్‌రాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని విదేశీయులు సైతం అంగీకరిస్తున్నారని, మనది వేద ధర్మమని చెప్పారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా సహించమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.నారాయణ, శ్యామ్‌ప్రసాద్, చలపతిరావు, శాస్త్రి, వడ్డాది కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రమా సత్యనారాయణ, విజయలక్ష్మి, నారాయణ, శ్యామ్‌ప్రసాద్ తదితరులు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ వైద్యులు మంగళవారం రాధానగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వ్యర్థాలు తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. 'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' అనే నినాదంతో అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. డాక్టర్ ఎ.జె..వి.సాయిప్రసాద్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. నగరపాలక సంస్థ సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేశారు.



కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసిన విద్యార్థులు, వాలంటీర్లు, అధ్యాపకులు

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సార్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కె.అరుణ, లక్ష్మీ శర్వాణి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాకపోకలు పునరుద్ధరించరూ..!

మధురానగర్, న్యూస్‌టుడే

బుడమేరు గండి పాక్షికంగా పూడ్చివేత

విజయదుర్గానగర్ వద్ద బుడమేరు-ఏలూరు కాలువకు మధ్య ఉన్న కట్టకు పడిన గండిని అధికారులు పాక్షికంగా పూడ్చి వేశారు. బుడమేరుకు ఎవరూ ఊహించని విధంగా వరద రావటంతో ఈ నెల 3న విజయదుర్గానగర్ వద్ద గండి పడిన విషయం తెలిసిందే. ఫలితంగా వరద నీరు ఏలూరు కాలువలోకి చేరింది. దాదాపు వారం రోజుల పాటు ఉద్ధృతి కొనసాగటంతో.. బుడమేరు గట్టుకు పెద్ద మొత్తంలో కోత పడింది. దాదాపు పది అడుగులకు పైగా లోతైన గోతులు ఏర్పడ్డాయి. ప్రవాహం తగ్గిన తర్వాత ఇటీవల బుడమేరు గండిని పాక్షికంగా పూడ్చారు.



బుడమేరు పక్కనే పాక్షికంగా మట్టితో పూడ్చిన గండి



ఈ ప్రాంతంలో గుంతలు పూడ్చాల్సి ఉంది..

మళ్లీ పెద్ద వర్షం వస్తే..

బుడమేరు కట్టను పూర్తి స్థాయిలో పూడ్చకపోవటంతో విజయదుర్గానగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ గతంలో రోడ్డు ఉండేది. దీని మీదుగా ద్విచక్ర వాహనాలు తిరిగేవి. సుమారు వెయ్యి మంది ప్రజలకు ఇదే దారి. వరద ఉద్ధృతికి రోడ్డుతో పాటు కట్ట పూర్తిగా కొట్టుకుపోయింది. స్థానిక ప్రజలు వంతెన వైపు వచ్చే మార్గం మూసుకుపోయింది. వీరు మధురానగర్‌లోకి వచ్చి, అక్కడి నుంచి నగరంలోకి వెళ్లాల్సి వస్తోంది. ఇది దూరాభారంగా మారింది. మళ్లీ అల్పపీడనం ఏర్పడిందని, వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ ఇచ్చిన ప్రకటన.. స్థానికుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏ మాత్రం పెద్ద వర్షం పడినా.. బుడమేరు గట్టు వద్ద తాత్కాలికంగా వేసిన కట్ట కొట్టుకుపోతుందేమోనని భయపడుతున్నారు. మరోవైపు కొట్టుకుపోయిన రోడ్డు, దాని పక్కన దాదాపు పది అడుగుల లోతైన గుంతలు ఉన్నాయి. వీటిని ఇంకా పూడ్చలేదు. ఇలాంటి వాటిని ఏకకాలంలో పూడ్చరు. అంచెలంచెలుగా పూడుస్తామని అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా పనులు చేపట్టకపోవటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని పూర్తిగా పునరుద్ధరించి భవిష్యత్తులో కోత పడకుండా పటిష్ఠంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణ ప్రణాళికాధికారుల బదిలీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ప్రణాళికాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని విజయవాడలో నియమిస్తూ.. ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు.

- పాతబస్తీ పరిధిలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఆశను ఉయ్యూరు బదిలీ చేశారు.
- పూర్ణానందంపేటలో విధులు నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి కె.అరుణను తాడిగడప పురపాలక సంఘానికి బదిలీ చేశారు.
- సత్యనారాయణపురం టౌన్‌ప్లానింగ్ అధికారి వి.ఎం.వి.రమణారెడ్డిని ఎర్రగుంట్ల పురపాలక సంఘానికి పంపించారు.
- భవానీపురం టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎ.వెంకటేశ్వరరావును ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.
- మైదుకూరు టౌన్‌ప్లానింగ్ అధికారి జి.కృష్ణ, గుడివాడలో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.రాంబాబును విజయవాడ నగరపాలక సంస్థకు బదిలీ చేశారు.

వంట పాత్రల పంపిణీ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో నష్టపోయిన బాధితులకు కమ్మ వారి ఐక్య సేవా సమితి వంట పాత్రలు పంపిణీ చేసింది. సమితి కార్యవర్గ సభ్యుడు పరుచూరి ప్రసాద్ నేతృత్వంలో 200 కుటుంబాలకు రెండు భోజనం ప్లేట్లు, రెండు వంట గిన్నెలు, రెండు మూతలు చొప్పున పంపిణీ చేశారు. పరుచూరి వనజ, బుద్ధ రాజలింగం, సూర్యదేవర మురళి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు గిన్నెలు అందిస్తున్న ప్రసాద్

మసీదులకు వితరణ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదలో పలు మసీదులోని వస్తువులు పాడైపోయాయి. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు.. నమాజ్ చేసే జానీమాస్, మైక్ సెట్లను మంగళవారం నిర్వాహకులకు పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు షేక్ జాన్‌వలీ, అన్వర్, పర్వీన్, బంగారునాయుడు, మరక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీ-I గా రామచంద్రరావు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీ స్థాయి అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ కమిషనరేట్ ట్రాఫిక్ 1 ఏసీపీగా వెయిటింగ్‌లో ఉన్న పి.రామచంద్రరావును నియమించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడిగా మోహనకృష్ణ

గాంధీనగర్, న్యూస్‌టుడే : హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడిగా విశాఖపట్నంకు చెందిన వరద మోహనకృష్ణ నియమితులయ్యారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర చీఫ్ కమిషనర్ డి.రామగంగాధర్ నియామకపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తానని మోహనకృష్ణ పేర్కొన్నారు. మానికొండ శ్రీధర్ మాదిగ పాల్గొన్నారు.

గవర్నర్‌పేట సీఐ బాధ్యతల స్వీకరణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా నాగమురళిని నియమిస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ముత్యాల సత్యనారాయణ ముంబయి నటి జెత్వాని కేసులో ఇటీవలే సస్పెండ్ అయ్యారు. ఆయన స్థానంలో సూర్యారావుపేట సీఐ అహ్మద్ ఆలీని ఇన్‌ఛార్జిగా నియమించారు. తాజాగా గవర్నర్‌పేట సీఐగా నాగమురళిని నియమించటంతో.. ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో జగ్గయ్యపేట సీఐగా, ఎన్నికల ముందు గవర్నర్‌పేట సీఐగాను పనిచేశారు. ఎన్నికల కోడ్ రావడంతో.. రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఫలితాల అనంతరం ఎన్టీఆర్ కమిషనరేట్‌కు వచ్చారు.



నాగమురళి

విద్యుత్తు టౌన్ ఈఈగా రవీంద్రబాబు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విజయవాడ విద్యుత్తు సర్కిల్ టౌన్ ఈఈగా పి.రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా.. గుణదలలోని స్కాడ్ ఈఈగా పని చేస్తున్న పి.రవీంద్రబాబును టౌన్ ఈఈగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న బి.వి.సుధాకర్ మచిలీపట్నం టెక్నికల్ ఈఈగా బదిలీ అయ్యారు.



అక్టోబరులో విద్యుత్తు బిల్లుల సర్దుబాటు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వరద ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని ఇళ్లకు విద్యుత్తు మీటర్ రీడింగ్ తీయలేదని.. వారికి సగటును లెక్కించి ఈ నెలలో బిల్లులు ఇచ్చామని ఈఈ బి.వి.సుధాకర్ తెలిపారు. ఈ మొత్తాన్ని అక్టోబరు నెలలో సర్దుబాటు చేసి బిల్లులు కట్టించుకుంటామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల బిల్లులు చెల్లించకపోయినా సరఫరా నిలుపుదల చేయమని పేర్కొన్నారు. వరదతో తడిచిన ఇళ్లలో స్విచ్‌బోర్డులు, వైర్లు, మీటరు బోర్డులు, తెగి పడిన తీగలను తాకవద్దని సూచించారు. నీటితో తడిచిన మోటార్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, గ్రైండర్లను వాడవద్దని చెప్పారు. మరమ్మతులు చేయించిన తర్వాతే వాటిని వాడుకోవాలని కోరారు. విద్యుత్తు అంతరాయాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1912కు లేదా అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లకు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు.

రఘురామకృష్ణరాజుపై చర్యలకు డిమాండ్

గాంధీనగర్, న్యూస్‌టుడే : అంబేడ్కర్‌ని అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల కూటమి పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. దళితులకు రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ప్రొఫెసర్‌పై దాడి చేసిన కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు జీకే బాబు, రాచూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

గాంధీనగర్, న్యూస్‌టుడే : నీట్‌లో ప్రతిభచూపి, గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సింధూరను తోటి విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక శారదా రామకృష్ణ విద్యాలయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.సాయిరామ్ ప్రసాద్ కోరారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా రాణించాలని ఆకాంక్షించారు. సింధూరను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులయిన సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ముత్యాలంపాడులో తెదేపా నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్నట్లు 31వ డివిజన్ నాయకుడు డి.మురళీకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం వానపాలవారివీధి, దేవాలయం వీధి, అల్లూరి సీతారామరాజు రహదారి తదితర ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు వంటి మంచి పనులు చేసిందని వివరించారు. కార్యక్రమంలో గుర్రం సుబ్బారావు, రామకోటయ్య, శ్రీనివాస్, కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆపరేషన్ బుడమేరును అమలు చేయండి

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదతో నగరం మునిగిందని.. బాధితులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య కోరారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లో 600 మంది వరద బాధితులకు దుప్పట్లు, టవల్స్, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సహాయ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. 'ఆపరేషన్ బుడమేరు' కార్యక్రమాన్ని అమలు చేసి కబ్జాదారుల భరతం పట్టాలన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పినట్లు.. ఆక్రమణలకు గురైంది 70 ఎకరాలు కాదని, వందలాది ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. పేదలకు నష్టం జరగకుండా ఆక్రమణలను తొలగించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు.. బుడమేరు బాధితులపై పోలీసుల లాఠీఛార్జీని ఖండించారు. నష్టపరిహారం సక్రమంగా అందేలా చూడాలని. . లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యుడు కె.వి.భాస్కరరావు, లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి దుస్తులు ఇస్తున్న ఈశ్వరయ్య, శంకర్, భాస్కరరావు

'ప్రత్యేక హోదాపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ విమర్శించారు. మంగళవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కేసు హైకోర్టు బెంచి ముందుకు రాగా.. ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయలేదని విమర్శించారు. న్యాయమూర్తుల ఆదేశాలను బేఖాతరు చేయడం సరికాదన్నారు. తాను సెక్యులర్‌వాదిని అని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్.. సనాతన ధర్మంపై మాట్లాడటం తగదన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల మధ్య గొడవలు పెట్టవద్దని సూచించారు. కల్తీ లడ్డూ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. వైకాపాలో ఉన్న నాయకులంతా ఇప్పుడు జనసేనలోకి వస్తున్నారని.. 2029లో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవ్వాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్.. తన అయిదేళ్ల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న కె.ఎ.పాల్

28 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కుందావారి కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి వీఎంసీ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 28న బాలుర, 30న బాలికల క్రీడా జట్ల ఎంపికలు ఉంటాయని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.నారాయణస్వామి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయి. ఆసక్తిగల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, మధ్యాహ్న భోజన (ఎండీఎం)నమోదు పత్రం, నియోజకవర్గ ప్రవేశ నమోదు పత్రంతో హాజరవ్వాలని ఆయన కోరారు.

అలరించిన సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే : బాలు సప్తస్వరాలు పేరుతో తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కౌతా కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు తెలుగు చిత్రాల్లోని పలు పాటలను శ్రావ్యంగా ఆలపించారు. చింతకాయల చిట్టిబాబు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, బి.ఆంజనేయరాజు, ప్రసూన్‌రామన్ తదితరులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయకులు

ప్రతి ఆటోకి రూ.25 వేల పరిహారం ఇప్పించాలి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరదల్లో దెబ్బతిన్న ప్రతి ఆటోకి రూ.25 వేల చొప్పున పరిహారం ఇప్పించడంతో పాటు సర్వీస్ కంపెనీల్లో మరమ్మతులు వేగవంతం చేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావుకు ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీమా కంపెనీలు పెద్ద మనసుతో ఆలోచించి పూర్తి స్థాయిలో బీమా వచ్చేలా చూడాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని, బీ6, బీ4 వంటి ఆటోలకు ఆయా కంపెనీలు రూ.లక్ష వరకు ఎస్టిమేషన్ వేస్తున్నప్పటికీ బీమా కంపెనీలు పట్టించుకోకుండా... వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో తక్కువ మొత్తంలో ఇస్తామంటున్నాయని, అంగీకరించకుంటే పైసా కూడా రాదని కార్మికులను బెదిరించి సంతకాలు తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లలో ఉన్న ఆటోలకు ఫొటోలు తీయ లేదని, రికార్డులు ఫోర్స్‌లో లేవన్న సాకుతో కొన్ని కంపెనీలు బీమా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. నష్ట గణనలో వరద బాధిత కుటుంబాలతో పాటు మునిగిన ప్రతి ఆటోను నమోదు చేయాల్సి ఉండగా... ఎన్యూమరేషన్ అధికారులు ఇళ్లు మాత్రమే నమోదు చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. వివిధ ఆటో సంఘాల నాయకులు డి.శ్రీనివాసరావు, కె.దుర్గారావు, గరిమెళ్ల చిన్నా, పరమేశ్వరరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆటో సంఘాల నాయకులు

ఉపాధి ప్రణాళికలు అవసరం

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమేష్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కూటమి వంద రోజుల పాలనలో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. అభివృద్ధి, పేదల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు తిరిగి ఏర్పాటయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కె.పరమేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, తోట డేవిడ్‌రాజు, పి.రూబిన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ద్విచక్ర వాహనాన్ని జాగిలంతో పరిశీలిస్తున్న నున్న పోలీసులు

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు నున్న గ్రామీణ పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ కృష్ణమోహన్ నేతృత్వంలో వాంబేకాలనీ, శాంతినగర్, రాజీవ్‌నగర్, వడ్డెరకాలనీ, ఉడా కాలనీ, కండ్రిక తదితర ప్రాంతాల్లో కలియతిరిగారు. గంజాయి విక్రయదారులు, తాగేవారిపై నిఘా ఉంచేందుకు.. యాంటీ నార్కోటిక్ సెల్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. చేరువ వాహనం ద్వారా చిన్నారులు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గుర్తు తెలియని యువతి మృతదేహం స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడమేరు సమీప పొదల్లో గుర్తు తెలియని ఓ యువతి (25-35 సంవత్సరాలు) మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానాయక్‌నగర్ 5వ లైనుకు సమీపంలో ఉన్న బుడమేరు కాలువలో. . పొదల్లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, ఎముకలు బయటపడ్డాయి. తలను పూర్తిగా పురుగులు తినేయడంతో.. స్పష్టంగా కనిపించటం లేదు. మృతదేహంపై నలుపు రంగు లెగ్గిన్, నీలి రంగు టీ షర్ట్ ఉన్నాయి. ఇటీవల వరదల్లో మృతదేహం కొట్టుకుని వచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి రోడ్డుకు చెందిన ఓ వివాహిత (35) సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. భర్త ప్లంబర్‌గా పనిచేస్తున్నారు. భార్య ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌తో పాటు బంధువుల ఇళ్లలో వెతికారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

46 మందికి జరిమానా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు.. తనిఖీలు చేస్తున్నారు. 1, 2, 4 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. 46 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని సంబంధిత న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టారు. ఏడుగురికి రూ.15వేలు చొప్పున, 39 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు ఆర్.వి.శర్మ, లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

ఇల్లు విక్రయం.. ఆక్రమణ

మధురానగర్, న్యూస్‌టుడే : ఇల్లు అమ్మి రిజిస్ట్రేషన్ చేసి.. అదే ఇంటిని ఆక్రమించుకున్న తండ్రీకూతుళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పు గోదావరి జిల్లా మహేంద్రవాడకు చెందిన తేతలి కొండారెడ్డి (51) గుణదల నరసయ్యవీధిలోని ఒక ఇంటిని కొన్నారు. కోట వెంకట దుర్గాప్రసాద్.. అతని కుమార్తె నాగసౌమిక నుంచి 2013లో దీన్ని కొనుగోలు చేశారు. ఇంటి తాళాలను పగలకొట్టి ఆక్రమించుకున్నారని కొండారెడ్డి చెబుతున్నారు. దీనిపై ఇరువర్గాలు న్యాయస్థానంలో కేసులు పెట్టుకున్నారు. కొండారెడ్డి గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత పత్రాలన్నీ ఇవ్వటంతో వారు విచారణ జరిపి దుర్గాప్రసాద్ అతని కుమార్తె నాగ సౌమికలపై కేసు నమోదు చేశారు.

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.


కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".


శ్రీహర్ష, కషిక కపూర్

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్టు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శక్తియు, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్లకు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేక్షకులకు అందించనున్నాం" అన్నారు.


రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు

మరిన్ని విశేషాలు www.eenadu.net లో


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".

సీఆర్డీఏలో ఉద్యోగ ప్రకటనలు

డిప్యుటేషన్, ఒప్పంద ప్రాతిపదికన భర్తీకి చర్యలు



ఈనాడు - అమరావతి: సీఆర్డీఏలో కీలకమైన పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. వైకాపా హయాంలో కార్యకలాపాలు నిలిచిపోయి నిస్తేజంగా మారిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఇప్పుడు క్రియాశీలకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో డిప్యుటేషన్‌పై వచ్చిన వారినీ కక్షగట్టి సాగనంపారు. రాజధానిలో త్వరలో పనులు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఆర్డీఏలోని అన్ని విభాగాలను పటిష్ఠం చేస్తున్నారు. ఇందులో భాగంగా సీఆర్డీఏలోకి ప్రతిభావంతులైన అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పలు పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందుకు రెండు ఉద్యోగ ప్రకటనలను కమిషనర్ కాటమనేని భాస్కర్ జారీ చేశారు.

మళ్లీ పూర్వ కళ...: గత తెదేపా హయాంలో సీఆర్డీఏలో ఐదు శాఖల్లో 778 పోస్టులను మంజూరు చేసింది. అప్పట్లో 494 మంది అధికారులు, సిబ్బంది పనిచేశారు. వీరిలో సీఆర్డీఏ రెగ్యులర్ ఉద్యోగులు 83 మంది, పూర్వ వీజీటీఎం ఉడా సిబ్బంది.. 43, సీఆర్డీఏ ఒప్పంద సిబ్బంది 112, పొరుగుసేవల సిబ్బంది 140 మంది, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్లపై 116 మంది చొప్పున విధులు నిర్వర్తించారు. 2019లో వైకాపా వచ్చిన తర్వాత పనులను ఆపేసి, ఉన్న వారిని పంపారు. చాలా మంది తమ మాతృ శాఖలకు వెళ్లిపోయారు. గతంలో మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేస్తామని ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ పలు సార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టులను నింపేందుకు కసరత్తు చేస్తున్నారు.

డిప్యుటేషన్‌పై 108, ఒప్పంద ప్రాతిపదికన 12 పోస్టులు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై సీఆర్డీఏకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్న వారి కోసం జారీ చేశారు. ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ హోదాల్లో మూడేళ్ల కాలానికి పనిచేసేందుకు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్, స్ట్రక్చరల్, తదితర విభాగాల్లో ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. పోస్టులను బట్టి రెండు నుంచి 12 ఏళ్ల అనుభవం ఉన్న వారు కావాలని ఉద్యోగ ప్రకటనలో కోరారు. వచ్చే నెల 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. 108 పోస్టులను డిప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఏడాది కాలానికి ఒప్పంద పద్ధతిన పనిచేసేందుకు 12 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. లీగల్ మేనేజర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఎన్విరాన్‌మెంటలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, కంటెంట్ రైటర్, గ్రాఫిక్ డిజైనర్, వీడియో ఎడిటర్, ఎంఐఎస్ ఆపరేటర్, కమ్యూనికేషన్స్ జేడీ పోస్టుల కోసం పిలిచారు. బ్యాంకుల కన్సార్షియం, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, తదితర బ్యాంకులతో సమన్వయం కోసం, సామాజిక మాధ్యమాల్లో రాజధాని, సీఆర్డీఏ కార్యకలాపాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ప్రధానంగా కాంట్రాక్టు పోస్టులను నిర్దేశించారు.

విద్యాసాగర్ కస్టడీపై వాదనలు రేపటికి వాయిదా


ఈనాడు - అమరావతి: కాదంబరీ జెత్వానీ పెట్టిన కేసులో రిమాండ్‌లో ఉన్న వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు గురువారానికి వాయిదా పడ్డాయి. మంగళవారం విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో నిందితుడి తరపు న్యాయవాదులు కౌంటరు దాఖలు చేయాల్సి ఉంది. దీనికి వారు సమయం కోరారు. దీంతో కౌంటరు దాఖలు, వాదనల నిమిత్తం న్యాయాధికారి రామ్మోహన్ 26వ తేదీకి వాయిదా వేశారు. అదే రోజు వాదనలు పూర్తి అయితే.. తీర్పు కూడా వచ్చే అవకాశం ఉంది. సోమవారం ఇన్‌ఛార్జి కోర్టు అయిన మూడో ఏసీఎంఎం కోర్టులో పోలీసులు విద్యాసాగర్‌ను ఏడు రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే.


పత్తికి వరద పోటు... కౌలు రైతు ఆత్మహత్య

కంచికచర్ల, న్యూస్‌టుడే: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందా శివయ్య (42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ ఏడాది 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశారు. వ్యవసాయం ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు అప్పు చేశారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంట మొత్తం తుడుచుపెట్టుకుపోయింది. పెట్టుబడి మొత్తం వరద పాలైంది. అప్పులు తీర్చే మార్గం కనిపించక శివయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే పురుగుల మందు తాగారు. గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమితం అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందారు. శివయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. రాజు తెలిపారు.


శివయ్య (పాత చిత్రం)

ఆపద్బాంధవులు..!


సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ఎంపీ శివనాథ్, ఈశ్వరరావు, సురేష్, రాజా, వెంకట రమేష్, జగదీశ్వరరావు


ముఖ్యమంత్రికి రూ.10 లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న జయప్రకాశ్ నారాయణ, నాగార్జున తదితరులు



ఎమ్మెల్యే సౌమ్యకు రూ.13.76 లక్షల చెక్కు ఇస్తున్న ప్రైవేట్ పాఠశాలల సంఘం నేతలు


తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు రూ.15.19 లక్షల చెక్కు ఇస్తున్న అప్సా ప్రతినిధులు

నందిగామ, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు నందిగామ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘం ముందుకు వచ్చింది. సీఎం సహాయనిధికి రూ. 13.76 లక్షలు అందించింది. నందిగామలో మంగళవారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను సంఘం ప్రతినిధులు కలిసి చెక్కు అందించారు. ఎమ్మెల్యేని సత్కరించారు. సౌమ్య మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రైవేట్ పాఠశాలల సంఘం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు వై.రమేష్, కార్యదర్శి మహ్మద్ మస్తాన్, కోశాధికారి కిరణ్‌కుమార్, సభ్యులు కాపా రవీంద్రనాథ్, వీరేష్‌కుమార్, వేమూరి పూర్ణేష్, పగిడిపల్లి దేవసహాయం, రత్నవినోద్, సరికొండ అఖిల్, పాములపాటి రాంబాబు, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు తిరువూరు డివిజన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో తిరువూరు డివిజన్ పరిధిలోని 35 ప్రైవేట్ పాఠశాలలు తమ విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో రూ. 15.19 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి జమ చేసిన చెక్కును మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కె. నరసింహారావు, ఎన్. వెంకటేశ్వరరావు, ఎం. కిశోర్‌బాబు, యు. చక్రపాణి, బీఎస్ఆర్ రెడ్డి, ఎస్ఎన్‌బీ చారి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : వరద బాధితులకు ది కృష్ణా డిస్ట్రిక్ ఫైనాన్సియర్స్ అసోసియేషన్ సభ్యులు బాసటగా నిలిచారు. సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని ఇచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ, కార్యదర్శి వి.నాగార్జున, కోశాధికారి టి.హరికృష్ణ, సుంకర వీరభద్రరావు, బి.వై.నారాయణరావు కలిసి చెక్కు అందజేశారు.

❖ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ వరద బాధితులకు అండగా నిలిచింది. సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని ఇచ్చింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, కార్యదర్శి కోనేరు జగదీశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. జగదీశ్వరరావు తన వ్యక్తిగత సాయంగా రూ.లక్ష ఇచ్చారు. విజయవాడ కృష్ణా డిస్ట్రిక్ట్ ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని సురేష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు నాగుమోతు రాజా తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న శ్రీధర్, కమలాకరరెడ్డి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. కానూరులోని అనుమోలు ప్రభాకర్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గతంలో కంటే ప్రస్తుతం రాష్ట్రంలో ఫుట్‌బాల్ ఆట అభివృద్ధి చెందిందన్నారు. పోటీలకు 12 జిల్లాల నుంచి క్రీడాకారిణులు రావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ఎన్‌హెచ్ఆర్‌సీ (ఇంజినీరింగ్ వింగ్) ప్రధాన కార్యదర్శి కొమ్మసాని కమలాకరరెడ్డితో కలిసి కోటగిరి శ్రీధర్ క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి డానియేల్ ప్రదీప్, కోశాధికారి విజయ్, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఆలీబాబా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమాఖ్య ప్రతినిధుల సమావేశం నేడు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. మొగల్రాజపురంలోని రేషన్ డీలర్ల రాష్ట్ర సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేషన్ డీలర్లకు ఒకే పంపిణీ విధానం, ఒకే కమీషన్, గౌరవ వేతనం అమలు చేయడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సమాఖ్య ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి డీలర్లు వస్తారని తెలిపారు. సమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.సి.హెచ్. ఖాసిం, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం అభివృద్ధికి సహకరించండి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి ప్రాంతంలో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేలా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. మంగళవారం ఉండవల్లిలో లోకేశ్‌ను కలిసి ఏసీఏ స్టేడియం అభివృద్ధిపై పలు సూచనలు చేసినట్లు ఎంపీ వివరించారు. వెస్టర్న్ బైపాస్ నుంచి స్టేడియానికి వచ్చేందుకు అనుబంధ రోడ్లు, నిడమర్రు రైల్వే లైన్ దగ్గర ఆర్వోబీ నిర్మాణం, పార్కింగ్‌కు స్థలం, డ్రైనేజీ ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఆర్ఎం నరేంద్రకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రన్నింగ్ సిబ్బందికి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. వారికి వారాంతపు సెలవులు ఇవ్వాలన్నారు. అనారోగ్యానికి గురైన సిబ్బందికి రైల్వే ఆస్పత్రిలో సిక్‌లు కూడా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రూ లింక్‌ల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా డిపో ఇన్‌ఛార్జి ఇష్టానుసారం విధులకు పంపుతున్నారని ఆరోపించారు. రన్నింగ్ కార్మికుల పని గంటలు 12 గంటలు మించకూడదని రైల్వే బోర్డు ఇచ్చిన ఆదేశాలను ఇక్కడి అధికారులు పాటించడం లేదని విమర్శించారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రన్నింగ్ సిబ్బంది పాల్గొన్నారు.